ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

బుధవారం 4 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 139 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్
అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం
ప్రతినిధుల సభలోని 435, సెనెట్‌లోని 35 స్థానాలకు ఓటింగ్
అధ్యక్షుడు ట్రంప్ రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఎన్నికలు
గెలిస్తే ట్రంప్ నిర్ణయాలను అడ్డుకుంటామంటున్న డెమోక్రాట్లు
భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం నుంచి ఫలితాల వెల్లడి





ఉక్రెయిన్‌లోని గ్రామంపై
రష్యా దాడులు
26 మంది దుర్మరణం..!

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు
నమోదుకు గడువు పెంపు

తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ చివరి రోజు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం లోని అర్హులు ఓటు కోసం ఈ నెల 6 వరకు ఫారం 18 సమర్పించాలని సీఈవో పేర్కొన్నారు.

- హైదరాబాద్, నవంబర్ 3 (సింగిడి)



చిన్న పట్టణాలను
వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

పట్టణాభివృద్ధికి రూ.లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్
దేశ ఆర్థిక కార్యకలాపాలకు పట్టణాలే కీలకం
స్థానిక సంస్థలు, ప్రైవేటు రంగం భాగస్వాములు కావాలి
రూ.21,800 కోట్ల పుణె మెట్రో ప్రాజెక్టు ప్రారంభం
26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు



ఆలస్యం చేయకండి..
త్వరగా చర్చకు రండి

ఇప్పటికే 24 గంటలు గడిచి పోయాయి:
మోదీకి సవాల్ విసిరిన రాహుల్





ముంపు భూముల పరిహారానికి సిద్ధం

నిధులు జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తాం
తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలు జరపండి!
భూసేకరణ, ముంపు వివరాలతో సిద్ధంగా ఉండాలి
గత ఒప్పందాలు, సంబంధిత పత్రాలు మహారాష్ట్రకు అందించాలి
సర్వేకు అభ్యంతరం లేదన్న సీఎం రేవంత్‌రెడ్డి

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే జరిగిన ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సీఎం స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు.

- హైదరాబాద్, నవంబర్ 3 (సింగిడి)

ఢిల్లీ దర్బార్... కుర్చీలాట!

ప్రజాస్వామ్యంలో పదవులు అంటే ప్రజలకు సేవ చేసే బాధ్యతలు. అధికారం అంటే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే అవకాశం. కానీ నేటి రాజకీయాల్లో ఈ సూత్రాలకు భిన్నమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు.. పదవుల కోసం పంతాలకు దిగుతున్నారు. ప్రజల మధ్య ఉండి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు.. ఢిల్లీ వేదికగా ఆధిపత్య పోరుకు తెర లేపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫైవ్‌స్టార్ హోటళ్లలో రాజకీయ రగడ, నేతల మధ్య మాటల యుద్ధం, బెదిరింపుల ఆరోపణలు, మద్యం మత్తులో కొట్లాటలంటూ సోషల్ మీడియాలో ప్రచారం.. ఇవన్నీ రాజకీయ వ్యవస్థ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అభివృద్ధి పనులకు నిధులు లేవని ప్రజలు ఆవేదన చెందుతుంటే.. పదవుల కోసం నేతలు సాగిస్తున్న పోరాటం మాత్రం చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

పదవుల కోసం నేతల కొట్లాట.. ప్రజాస్వామ్య విలువలకు తూట్లు!

పదవుల పంచాయితీతో ఢిల్లీలో నేతల మధ్య ఆధిపత్య పోరు
ఫైవ్‌స్టార్ హోటల్ వేదికగా అధికార అహంకార ప్రదర్శన
ప్రజాప్రతినిధుల నోట వీధి రౌడీలను తలపించే భాష
మంత్రి బెదిరింపులంటూ ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన
మద్యం మత్తులో కొట్లాటలంటూ సోషల్ మీడియాలో ప్రచారం
ప్రజా సమస్యలను పక్కనపెట్టి స్వార్థ రాజకీయాలకు పెద్దపీట
నిధుల కొరతపై ఓటర్ల నుంచి వ్యంగ్య విమర్శలు
ఓటు వేసి గెలిపించిన ప్రజలకు మిగిలింది నిస్సహాయతే
దిగజారుతున్న ప్రజాస్వామ్య
నైతిక విలువలకు ఢిల్లీ పరిణామాలు అద్దం



పదవుల కోసం పంతాలు

రాజకీయాల్లో పదవులు సహజమే. వాటి కోసం పోటీ పడటమూ కొత్త కాదు. కానీ ఆ పోటీ వ్యక్తిగత కక్షలు, ఆధిపత్య ప్రదర్శనలు, పరస్పర ఆరోపణల స్థాయికి చేరితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ఇబ్బందికరం. ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలు ఇదే చర్చకు తెర లేపాయి. పదవుల పంపకాలు, రాజకీయ ప్రాధాన్యత, నాయకత్వంపై పట్టు సాధించాలనే ప్రయత్నాలు నేతల మధ్య విభేదాలను మరింత పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల కోసం పనిచేయాల్సిన నాయకులు.. తమ రాజకీయ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికార మదం బయటపడిందా?

ఫైవ్‌స్టార్ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదాలు, పరస్పర ఆరోపణలు, బెదిరింపుల వ్యవహారం రాజకీయ సంస్కృతిపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. మంత్రి నుంచి బెదిరింపులు ఎదురయ్యాయంటూ ఓ ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నేతలు మద్యం మత్తులో గొడవపడ్డారంటూ సోషల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ ప్రచారాల్లోని వాస్తవాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే.. ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంటుంది.

....మిగతా 2లో

దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు

అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!
అమిత్ షా పర్యటనపై మంత్రి అడ్లూరి విమర్శలు
తప్పులుంటే బయటపెట్టాలని కేంద్రానికి సవాల్
దమ్కీలకు భయపడబోమని వ్యాఖ్య
ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు
బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపణ
జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్



టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం
ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న సీఎం చంద్రబాబు
టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వం.. రికార్డు సమయంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ
సహాయక చర్యల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని కితాబు

రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును ఆయన వివరించారు. తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు.

- అమరావతి, నవంబర్ 3 (సింగిడి)



తెలంగాణలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్



ఏపీలో మురసు తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ తుఫాన్ ప్రభావం తెలంగాణపైనా చూపిస్తోంది. తుఫాన్ ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అర్ధరాత్రి మురసు తుఫాన్ తెలంగాణను తాకనున్నట్టు పేర్కొంది. ఈ తుఫాన్ కారణంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. మహబూబాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

- హైదరాబాద్, నవంబర్ 3 (సింగిడి)

ఏపీ పురపోరులో కూటమి హవా!

13 కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి పాగా వేసే దిశగా ఫలితాలు
మేయర్ స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల జయకేతనం
17 పురపాలికలు ఏకగ్రీవం.. 15 చోట్ల టీడీపీ విజయం
కుప్పంలో టీడీపీ క్లీన్‌స్వీప్.. పిఠాపురంలో జనసేన జెండా
పులివెందులలోనూ వైఎస్సార్సీపీకి భారీ ఎదురుదెబ్బ



పులివెందులలో ఎగిరిన
పసుపు జెండా

జగన్ సొంత గడ్డపై టీడీపీ చారిత్రక విజయం..



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కూటమి పార్టీల హవా కొనసాగుతోంది. పురపాలికలు, నగరపాలికల ఓట్ల లెక్కింపు తుది దశకు చేరుకోగా ఇప్పటివరకూ వెలువడిన ఫలితాల్లో మూడు పార్టీలు అద్భుత ఫలితాలను సాధించాయి. ఎన్నికలు జరిగిన మొత్తం 13 కార్పొరేషన్లలో కూటమి పార్టీలు 12 చోట్ల పాగా వేసే దిశగా సాగుతున్నాయి.

- అమరావతి, నవంబర్ 3 (సింగిడి)

చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి
కంగ్రాట్స్.. జగన్ వ్యంగ్యం

ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు హైజాక్ చేశారని విమర్శ
ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య

జనరల్ న్యూస్ సింగిడి

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సింగిడి)



అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధాన పరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముంపు భూముల పరిహారానికి సిద్ధం

సర్వే చేయించుకున్నా అభ్యంతరం లేదు



మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామని చెప్పారు. భూముల ముంపుపై మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గతంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణమే అజెండాగా ముంబయిలో గత నెల 26న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ భేటీలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ప్రాధాన్యతను, కలిగే లాభాలను మహారాష్ట్ర సీఎంకు వివరించారు. భేటీ తరువాత పూర్తి స్థాయి నీటిమట్టం 148 మీటర్ల వరకే అని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.
అయితే రేవంత్ సర్కార్ నిర్మాణం 152 మీటర్ల ఎత్తు వరకు ఉండాలని కోరుకుంటున్నారు. అయితే దీనికి మహా సర్కార్ గతంలోనే నిరాకరించింది. 148 మీటర్ల వరకు అయితే పునరాలోచిస్తామని భేటీలో ఆ రాష్ట్ర సీఎం హామీ ఇచ్చారు. జలాశయం నిర్మాణం వలన మహారాష్ట్రలో మునిగిపోయే ప్రాంతాల రైతులకు పరిహారం అందించేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు సర్వే చేసేందుకు ఓ కమిటీని నియమించారు.

ఉక్రెయిన్‌లోని గ్రామంపై రష్యా దాడులు.. 26 మంది దుర్మరణం..!

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సింగిడి)

ఐదేండ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. రెండు వైపులా ఇప్పటికే భారీగా సైనిక నష్టం, ఆస్తినష్టం జరిగింది. తాజాగా ఉక్రెయిన్‌లోని మానవతా సాయం అందించే కేంద్రాలపై రష్యా బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ దక్షిణ ప్రాంతంలోని జపోరిజియా రీజియన్ లోని ఓ గ్రామంపై ఈ దాడులు జరిగాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ ఎమర్జెన్సీ సర్వీసెస్ ఏజెన్సీ వెల్లడించింది. యుద్ధంవల్ల నిరాశ్రయులైన వారికి మానవతా సాయం పంపిణీ కోసం ఉపయోగిస్తున్న ఒక పాఠశాల భవనం, దానికి సమీపంలోని షెల్టర్‌ను లక్ష్యంగా చేసుకుని రష్యా బలగాలు 10 గైడెడ్ బాంబులతో విరుచుకుపడ్డాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. రష్యాకు ఉద్రిక్తతలు తగ్గించే ఉద్దేశం లేదనడానికి ఇదే నిదర్శనమని మండిపడ్డారు. మరోవైపు 212 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఐరోపాలో అతిపెద్ద చమురు సరఫరా కేంద్రాల్లో ఒకటైన సమారా ప్రాంతం లక్ష్యంగా చేసిన ఉక్రెయిన్ డ్రోన్ల దాడిని తమ గగనతల రక్షణవ్యవస్థ తిప్పికొట్టిందని తెలిపింది. మరోవైపు ఉక్రెయిన్, రష్యాల్లోని ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్ట్ యాప్‌లు సైబర్ దాడులకు గురయ్యాయి. ఇరుదేశాల్లో ప్రజలకు అణు ముప్పు, రేడియేషన్, రసాయన దాడులు పొంచి ఉన్నాయంటూ సైబర్ నేరస్థులు నకిలీ సందేశాలు పంపించి పౌరులను ఆందోళనకు గురిచేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పెంపు

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సింగిడి)



ఈ నెల 6 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత ఈ నెల 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి వచ్చే నెల 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా నామినేషన్ల గడువు చివరి రోజు వరకు కూడా గ్రాడ్యుయేట్లు ఓటు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. సీఈవో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో గత రెండు రోజులు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ స్తంభించింది. మధ్యాహ్నం సాంకేతిక సమస్యలు సరిచేశారు.

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కూటమి పార్టీల హవా

గుంటూరు మేయర్‌గా టీడీపీ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీఅపర్ణ గెలిచారు. మచిలీపట్నం మేయర్‌గా టీడీపీ అభ్యర్థి షేక్ అబ్దుల్లా అబీదా విజయం సాధించారు. తిరుపతి మేయర్‌గా టీడీపీ అభ్యర్థి మన్నెం శ్రీనివాస ప్రసాద్ గెలిస్తే చిత్తూరు మేయర్‌గా టీడీపీ అభ్యర్థి కఠారి హేమలత జయభేరి మోగించారు. కర్నూలు మేయర్‌గా టీడీపీ అభ్యర్థి విజయ ప్రత్యూష విజయం సాధించారు. విజయనగరం, విశాఖ, నెల్లూరు, కడపలో తెలుగుదేశం అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. తుపాను కారణంగా ఒంగోలు కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపు ఆలస్యమవుతోంది. విజయవాడ, ఏలూరులో జనసేన అభ్యర్థులు వంగవీటి రాధాకృష్ణ, రెడ్డి అప్పలనాయుడు ఆధిక్యంలో ఉన్నారు. అనంతపురంలో వైఎస్సార్సీపీ, బీజేపీ మధ్య గట్టి పోటీ నడుస్తోంది.

17 పురపాలికలు ఏకగ్రీవం

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కూటమి



పార్టీలు దూసుకెళుతున్నాయి. 17 పురపాలికలు ఇప్పటికే ఏకగ్రీవం కాగా అందులో తెలుగుదేశం 15, జనసేన, బీజేపీ ఒక్కో చోట పాగా వేశాయి. మిగతా 70 చోట్ల ఛైర్ పర్సన్ అభ్యర్థులకు ఎన్నికలు జరగ్గా ఇప్పటి వరకు తెలుగుదేశం 54 చోట్ల విజయం సాధించింది. 5 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. 17 పురపాలికల్లో జనసేన ఇప్పటికే జయభేరి మోగించింది. 1 చోట ఆధిక్యంలో కొనసాగుతోంది. బీజేపీ 4 చోట్ల గెలుపొందింది.
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మున్సిపాలిటీలో టీడీపీ ఘన విజయం సాధించింది. కుప్పంలోని 32 వార్డులకు 31 చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలిచారు. కుప్పం మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి ఎస్.రాజకుమార్ 15 వేల 536 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నపిఠాపురం పురపాలకసంఘంలో జనసేన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి దానం లాజర్‌బాబు 8 వేల 944 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పిఠాపురంలోని 36 వార్డుల్లో జనసేన 19, టీడీపీ 5, బీజేపీ 1 చోట గెలిచాయి. ఆదోనిలో జనసేన తిరుగుబాటు అభ్యర్థి స్వప్న విజయం సాధించారు.

వైఎస్సార్సీపీ ఘోర పరాజయం

మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఆ పార్టీ అధినేత జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలోనే ఆ పార్టీ చిత్తుగా ఓడిపోయింది. పులివెందులలోని 40 వార్డుల్లో 37 చోట్ల కూటమి పార్టీలు గెలిచాయి. కేవలం 3 వార్డుల్లోనే వైఎస్సార్సీపీ విజయం సాధించింది. పులివెందుల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి గీతాకుమారి 13 వేల 875 ఓట్ల మెజార్టీతో జయభేరి మోగించారు. నందికొట్కూరులో గెల్చిన వైఎస్సార్సీపీ, బేతంచర్ల, నాయుడుపేటలో ముందంజలో ఉంది. సాలూరు, నెల్లిమర్లలో స్వతంత్ర అభ్యర్థులు లీడ్‌లో కొనసాగుతున్నారు. తుపాను కారణంగా చీరాల మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపును ఈ నెల 6వ తేదీకి వాయిదా వేశారు.

పులివెందులలో ఎగిరిన పసుపు జెండా

జగన్ సొంత గడ్డపై టీడీపీ చారిత్రక విజయం..

అమరావతి, నవంబర్ 3 (సింగిడి)



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా కడప జిల్లాలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. వైఎస్ కుటుంబానికి కంచుకోటగా, వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గంగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి కైవసం చేసుకుంది. టీడీపీ 43 ఏళ్ల రాజకీయ చరిత్రలో పులివెందులలో జెండా ఎగరేయడం ఇదే ప్రథమం. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో భాగంగా, పులివెందుల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారి, వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మపై సుమారు 13,875 ఓట్ల భారీ మెజారిటీతో చారిత్రక విజయం సాధించారు. వైఎస్ కుటుంబానికి తిరుగులేని పట్టున్న ప్రాంతంలో ఇంతటి భారీ తేడాతో టీడీపీ గెలవడం వైసీపీ శ్రేణులకు ఊహించని షాక్ ఇచ్చింది. ఇక, వార్డుల వారీగా చూస్తే, కూటమి సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పోలింగ్ జరిగిన 20 వార్డుల్లో 17 చోట్ల కూటమి అభ్యర్థులు గెలుపొందగా, వైసీపీ కేవలం 3 వార్డులకే పరిమితమైంది. ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 37 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధించి పులివెందుల పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఈ గెలుపు కేవలం పులివెందులకు మాత్రమే పరిమితం కాలేదు. కడప జిల్లా వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ టీడీపీ కూటమి విజయదుందుభి మోగించింది. బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాజంపేట, యర్రగుంట్ల మున్సిపాలిటీలను సైతం కైవసం చేసుకుని జిల్లాపై సంపూర్ణ పట్టు సాధించింది. ఈ ఫలితాలు కడప జిల్లా రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి

కంగ్రాట్స్.. జగన్ వ్యంగ్యం

అమరావతి, నవంబర్ 3 (సింగిడి)



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఢిల్లీ దర్బార్... కుర్చీలాట!

ప్రజా సమస్యలు గాలికి

ఒకవైపు ప్రజలు తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సమస్యతో సతమతమవుతున్నారు. అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాయకుల రాజకీయ పంచాయితీలు మాత్రం విలాసవంతమైన వేదికల్లో సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాల్సిన నేతలు.. పదవుల కోసం రోజులు గడుపుతున్నారనే వ్యంగ్యాస్త్రాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అభివృద్ధికి నిధుల కొరత.. రాజకీయాలకు మాత్రం ఆర్థాటాల కొరత లేదా? అంటూ ఓటర్లు ప్రశ్నిస్తున్నారు.

ఓటరుకు మిగిలింది నిరాశే

ఎన్నికల సమయంలో ప్రజల చుట్టూ తిరిగి హామీలు ఇచ్చే నాయకులు.. గెలిచిన తర్వాత తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ప్రజల్లో బలపడుతోంది. ఓటు వేసి గెలిపించినందుకు తమకు దక్కాల్సిన అభివృద్ధి, సంక్షేమం పక్కకు వెళ్లి.. నేతల మధ్య కుర్చీలాటే ప్రధాన అంశంగా మారిందని ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం ఉండదు.. నాయకుల మధ్య విభేదాలు వస్తే మాత్రం రోజంతా రాజకీయ చర్చలే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటరే అసలైన అధికారి అయినప్పటికీ.. రాజకీయ పరిణామాల్లో అతడి గొంతు వినిపించని పరిస్థితి నెలకొందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

విలువలకు తూట్లు

ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలు, పదవులు, అధికార మార్పిడితో ముగిసేది కాదు. ప్రజాప్రతినిధుల ప్రవర్తన, రాజకీయ సంస్కారం, ప్రజల పట్ల బాధ్యత కూడా అంతే ముఖ్యం. కానీ పదవుల కోసం పరస్పర దూషణలు, బెదిరింపుల ఆరోపణలు, అధిపత్య పోరాటాలు తెరపైకి వస్తున్న తీరు వ్యవస్థలో నైతిక విలువలు దిగజారుతున్నాయనే ఆందోళనకు కారణమవుతోంది. ప్రజాసేవకు ప్రతీకగా ఉండాల్సిన పదవులు.. వ్యక్తిగత ప్రతిష్ఠకు, రాజకీయ ప్రయోజనాలకు వేదికలుగా మారితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం ఎలా నిలుస్తుంది?
ఢిల్లీ రాజకీయ పరిణామాలు ఒక ప్రాంతానికో, ఒక పార్టీకి మాత్రమే పరిమితమైన అంశం కాదు. ప్రజా ప్రతినిధుల బాధ్యత, రాజకీయ సంస్కారం, ప్రజాస్వామ్య విలువలపై విస్తృత చర్చకు దారితీసే పరిణామాలు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నాయకులు.. ప్రజల సమస్యల పరిష్కారానికే తమ సమయాన్ని, శక్తిని వెచ్చించాలి. కుర్చీల కోసం కొట్లాడటం కాదు.. ప్రజల కోసం పనిచేయడమే రాజకీయ నాయకత్వానికి అసలైన గౌరవం. లేదంటే ఢిల్లీ దర్బార్‌లో సాగుతున్న కుర్చీలాట.. రాజకీయ నాయకుల వ్యవహారశైలికి, ప్రజాస్వామ్య విలువల పతనానికి అద్దం పట్టినట్లే అవుతుంది.

ఆలస్యం చేయకండి..

త్వరగా చర్చకు రండి

ఇప్పటికే 24 గంటలు గడిచిపోయాయి: మోదీకి సవాల్ విసిరిన రాహుల్

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సింగిడి)

తనతో చర్చకు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సవాలు విసిరి 24 గంటలు గడిచిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిపక్షం దేశద్రోహి అని మోదీ ఆరోపించడంపై రాహుల్ మండిపడ్డారు. 'అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? ఆలస్యం చేయకండి, త్వరగా చర్చకు రండి, భయపడకండి' అని మోదీకి సవాల్ విసిరారు. ఏ వేదికైనా, ఏ సమయమైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రాహుల్ పేర్కొన్నారు.
మీడియా, యువత సమక్షంలో ఒకే వేదికపై మాట్లాడుకుందామన్న రాహుల్, ఈ చర్చలో వ్యాఖ్యతగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌ను కూర్చోబెట్టినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థ, అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు, క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, అదానీ కేసులను మూసివేయడం, ఎప్‌స్టీన్ అంశాలపై బహిరంగంగా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అసలు నిజాలు ఏంటో ప్రజల ముందు బయటపెడతానని రాహుల్ గాంధీ వెల్లడించారు.

చిన్న పట్టణాలను వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సింగిడి)

మన దేశంలోని వందలాది చిన్న పట్టణాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలు కేవలం నివసించే ప్రదేశాలు మాత్రమే కాదని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు అవి ప్రధాన కేంద్రాలని ఆయన నొక్కి చెప్పారు. రూ.21,800 కోట్లతో నిర్మించిన పుణె మెట్రో ప్రాజెక్టును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పింక్ లైన్ అని పిలిచే పూణె మెట్రో లైన్3ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగానే ఆయన పట్టణాభివృద్ధి గురించి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా పాల్గొన్నారు.

మెట్రోతో ప్రాంతాల మధ్య అనుసంధానం

కొత్తగా ప్రారంభించిన మెట్రో ప్రాజెక్టుల వల్ల పుణెలోని కొత్త, పాత ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "పుణె మెట్రోలో మరొక లైన్ ఈ రోజు ప్రారంభం కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. పదేళ్ల క్రితం, పుణెలో ఈ ప్రాజెక్టు మొదటి దశకు శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హింజావాడి, శివాజీనగర్ మధ్య మెట్రో సేవలు ప్రారంభం కావడంతో, పుణెలోని ఒక ప్రధాన ఐటీ హబ్‌కు ఇప్పుడు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. ఈ రోజు పనులు ప్రారంభమైన కొత్త లైన్, పుణె పాత, కొత్త ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మరింత పటిష్టం చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.

కీలక రంగాలకు కేంద్రంగా పుణె

భారతదేశం అభివృద్ధిలో పుణె పాత్రను హైలెట్ చేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మహానగరం ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్, స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగాలకు కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. "ఈ రోజు పుణె నగరం వికసిత్ భారత్ శక్తిని చాటుతోంది. ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్ నుంచి స్టార్టప్స్, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగం వరకు అన్ని రంగాలకు కేంద్రంగా ఎదుగుతోంది. పుణె మన దేశ యువత కలలు, ఆకాంక్షల వేదిక. స్థానిక మెట్రో కనెక్టివిటీ బలోపేతం కావడం పుణె నగరాభివృద్ధికి సరికొత్త వేగాన్ని అందించనుంది" అని మోదీ అన్నారు.

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం

మెట్రో లైన్ కోసం ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య నమూనా ను అనుసరించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. "ఈ మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ–ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో నిర్మించారు. ఇది దేశ పురోగతిని మరింత వేగవంతం చేసే విజయవంతమైన నమూనా. మిత్రులారా, ఈ రోజు భారతదేశంలోని ప్రతి పౌరుడు, యువతీ యువకులు వికసిత్ భారత్ నిర్మాణానికి పూర్తి అంకిత భావంతో పనిచేస్తున్నారు" అని ప్రధాని మోదీ అన్నారు.

మెట్రోలను భారీగా విస్తరించాం!

గడచిన 10–12 ఏళ్లలో భారతదేశ మెట్రో నెట్‌వర్క్ విస్తరణ గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "2014లో 248 కి.మీ ఉన్న మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం దాదాపు 1,200 కి.మీ మేర పెరిగింది. 2014లో మెట్రో సేవలు కేవలం 5 నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ నేడు దేశవ్యాప్తంగా 26 నగరాల్లో మెట్రో నడుస్తోంది. ఇప్పుడు ప్రతిరోజూ కోటి మందికి పైగా ప్రజలు మెట్రోల్లో ప్రయాణిస్తున్నారు" అని మోదీ పేర్కొన్నారు.

టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

"ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. 'అవేర్' వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు. విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. "సాధారణంగా



గాంధారి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

కామారెడ్డి, గాంధారి నవంబర్ 03 (సింగిడి) :

గాంధారి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని గిరిజన సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం గాంధారి మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గిరిజన సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతిరాం నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధికంగా కరువు పరిస్థితులు నెలకొన్న మండలాల్లో గాంధారి ఒకటని తెలిపారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి అధ్యయనం చేయకుండా జిల్లాలో కేవలం నాలుగు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరికాదన్నారు.గాంధారి మండలంలోని సుమారు 80 శాతం గ్రామాల్లో మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పెసర తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కనీసం 10 శాతం పంట దిగుబడి కూడా రైతుల ఇంటికి చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగు కోసం పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని పేర్కొన్నారు.మండలంలోని నాలుగైదు గ్రామపంచాయతీలు మినహా మిగతా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో గాంధారి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడంపై ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ యంత్రాంగం స్పందించాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం గాంధారి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో గిరిజన రైతులు, ఇతర రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నాయక్, బన్సీలాల్, మోహన్ నాయక్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గౌరారం పాఠశాలకు రూ.13.55 లక్షల నిధులు మంజూరు

కామారెడ్డి /గాంధారి నవంబర్ 03 (సింగిడి) :



ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నాబార్డ్ ద్వారా రూ.13.55 లక్షల నిధులు మంజూరు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కమ్మరి సంగమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వంజరి శంకర్, సీనియర్ నాయకులు గాజుల రాములు, గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేల్దే లక్ష్మన్, సత్యం, గాజుల ఆంజనేయులు, మండల యూత్ ఉపాధ్యక్షుడు బొర్లం శ్రీను, గ్రామ యూత్ ఉపాధ్యక్షుడు గంగారాం, పోతురాజు, అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు టీఆర్ఎస్ నాయకులు

మానకొండూర్, నవంబర్03(సింగిడి)



తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆశీర్వాదం పొందేందుకు మానకొండూరు నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, పార్టీ సైనికులు హైదరాబాద్‌కు బయలుదేరారు. ఇటీవల నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి నూతన కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో ఈ పర్యటన చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు కవితక్క ఆశీర్వాదాలు తీసుకొని, ఆమె నాయకత్వంలో పార్టీ ఆశయాలు, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సంకల్పించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. మానకొండూరు నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, అధినేత్రి కల్వకుంట్ల కవితక్క నాయకత్వాన్ని మరింత బలపరచడమే తమ ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు.

కామ్రేడ్ 'చండ్ర' పుల్లారెడ్డికి నివాళి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 03: (సింగిడి):

సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్ ఏ ఐ ఎఫ్ టి యు న్యూ జిల్లా కార్యాలయం ఆవరణలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ప్రసాద్ జెండా ఆవిష్కరణ చేయగా అనంతరం కామ్రేడ్ సోమిశెట్టి దశరథం సభ అధ్యక్షతన శాంతినగర్ ఆదర్శ పద్మశాలి సంఘం భవనంలో వర్ధంతి సభ జరిగింది. కామ్రేడ్ ప్రసాద్ ప్రసంగిస్తూ దేశంలో జరిగినటువంటి విప్లవోద్యమంలో అమరులైనటువంటి అమరవీరులను స్మరించుకుంటూ రాజ్యం కొనసాగించిన బూటకపు ఎన్కౌంటర్లలో అమరులైన కామ్రేడ్స్ వయోభారంతో అనారోగ్యంతో అమరులైనటువంటి కామ్రేడ్స్ అందరికీ విప్లవ జోహార్లు తెలుపుతూ వారు నడిచిన బాటలో మనమంతా నడవాలని వారు ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ బూర్జువా రాజకీయ దళారీ వ్యవస్థను పాల ద్రోలి ప్రజా వ్యవస్థను కాపాడాలంటే పోరాటమే మార్గం అని ప్రజలంతా ఆ దిశగా సన్నద్ధం కావాలని కోరారు. కామ్రేడ్ సోమిశెట్టి దశరథం,కామ్రేడ్ వొల్లాల కిషోర్ కామ్రేడ్ భామండ్ల రవీందర్, ఎర్ర జెండా బీడీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మచ్చ అనసూయ, కామ్రేడ్ బి సంగీతక్క జక్కని త్రివేణి, ముత్తంగి వసంత,మాసం ఆంజనేయులు,కొండ శ్యామ్ ఎర్రజెండా పవర్లూమ్ కార్మిక సంఘం నాయకులు గుజ్జే దేవదాస్,ఆకైనా సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వెనుకబాటు తనం నుంచి అభివృద్ధి వైపు..

ప్రగతి పథంలో కామారెడ్డి జిల్లా!
ఇతర రాష్ట్రాల వ్యాపారవేత్తలను ఆకర్షిస్తున్న కామారెడ్డి..
షాపింగ్ మాల్స్, హోటళ్లు, చిన్నా పెద్ద వ్యాపారాలతో మారుతున్న పట్టణ రూపురేఖలు
ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు..
స్థానికులకు కొత్త అవకాశాలు.. తెలంగాణ చూపు కామారెడ్డి వైపు

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 03 (సింగిడి)



కామారెడ్డి ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన కామారెడ్డి నేడు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భాగంగా ఉన్న కామారెడ్డి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. వ్యవసాయం, జల వనరులు, వ్యాపార రంగం, రవాణా, విద్య, వైద్య సదుపాయాలతో పాటు వాణిజ్య కార్యకలాపాల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారవేత్తలు కామారెడ్డికి వచ్చి పెట్టుబడులు పెట్టడం పట్టణ అభివృద్ధికి కొత్త ఊపునిస్తోంది.వ్యాపారవేత్తలకు ఆకర్షణగా కామారెడ్డికామారెడ్డి పట్టణంలో రోజురోజుకూ వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. గతంలో చిన్నచిన్న దుకాణాలకే పరిమితమైన వాణిజ్య రంగం ప్రస్తుతం పెద్ద షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, వివిధ రకాల వాణిజ్య సంస్థల ఏర్పాటుతో కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారవేత్తలు సైతం ఇక్కడి వ్యాపార అవకాశాలను గుర్తించి పెట్టుబడులు పెడుతున్నారు. వారితో పాటు స్థానిక వ్యాపారులు కూడా తమ వ్యాపారాలను విస్తరిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల వారికి ఉపాధికామారెడ్డి అభివృద్ధిలో మరో ముఖ్యమైన అంశం ఉపాధి అవకాశాలు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగం, రవాణా, ఇతర సేవా రంగాల్లో స్థానిక యువతతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా పనిచేస్తున్నారు. జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి కామారెడ్డికి వచ్చి స్థిరపడుతున్న కుటుంబాలు కనిపిస్తున్నాయి. వ్యాపారాల విస్తరణతో ఉద్యోగ అవకాశాలు పెరగడమే కాకుండా అనేక కుటుంబాలకు జీవనాధారం లభిస్తోంది.రైతన్నకు అండగా జల వనరులుకామారెడ్డి జిల్లాకు ప్రకృతి ప్రసాదించిన ముఖ్యమైన సంపదల్లో జల వనరులు ఒకటి. నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా వంటి సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు వ్యవసాయ రంగానికి తోడ్పడుతున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న వేలాది కుటుంబాలకు సాగునీటి వనరులు ఎంతో కీలకం. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగే కొద్దీ వాటి ఆధారంగా చిన్నతరహా పరిశ్రమలు, నిల్వ కేంద్రాలు, మార్కెటింగ్ వ్యాపారాలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయి.పట్టణ రూపురేఖల్లో మార్పులుజిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం వంటి ప్రభుత్వ, ప్రజా సేవా వ్యవస్థలతో కామారెడ్డి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. రహదారులు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, నివాస భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పట్టణ విస్తరణకు దోహదపడుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ అవసరాల కోసం జిల్లా కేంద్రానికి రావడం కూడా వ్యాపార కార్యకలాపాలకు ఊతమిస్తోంది.తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు దిశగాకామారెడ్డిలో కనిపిస్తున్న వ్యాపార విస్తరణ, పెట్టుబడుల ఆసక్తి, ఉపాధి అవకాశాలు జిల్లాకు కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారవేత్తలు ఇక్కడ వ్యాపారాలు ప్రారంభించడం, స్థానికులు కూడా పోటీగా కొత్త రంగాల్లోకి అడుగుపెట్టడం పట్టణ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులకు నిదర్శనంగా నిలుస్తోంది. తెలంగాణలోని ఇతర ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలు కూడా జీవనోపాధి, వ్యాపార అవకాశాల కోసం కామారెడ్డిని ఎంచుకుంటుండటం గమనార్హం.ఇంకా ఎన్నో అవకాశాలు.. మరింత అభివృద్ధి అవసరంఅభివృద్ధి వేగం పెరుగుతున్న నేపథ్యంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, చిన్న వ్యాపారులకు రుణ సదుపాయాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, యువతకు నైపుణ్య శిక్షణ, మెరుగైన రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. స్థానికులకు ప్రాధాన్యతతో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ పెట్టుబడులకు అనుకూల వాతావరణం కొనసాగితే కామారెడ్డి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.మొత్తంగా చెప్పాలంటే..ఒకప్పుడు వెనుకబాటుతనానికి చిరునామాగా భావించిన కామారెడ్డి నేడు వ్యవసాయం, జల వనరులు, వ్యాపారం, ఉపాధి, వాణిజ్య రంగాల్లో కొత్త అవకాశాలతో ముందుకు సాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలకు, స్థానిక పారిశ్రామికవేత్తలకు, చిన్న వ్యాపారులకు వేదికగా మారుతోంది. ఉపాధి కోసం వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వస్తుండటం కామారెడ్డి పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.రైతన్నకు నీటి భరోసా.. వ్యాపార వేత్తలకు పెట్టుబడుల అవకాశం.. యువతకు ఉపాధి మార్గం.. ఇతర ప్రాంతాల ప్రజలకు జీవనాధారం.. ఇలా అన్ని రంగాల సమన్వయంతో కామారెడ్డి అభివృద్ధి పథంలో తనదైన ముద్ర వేస్తోంది. నిన్నటి కామారెడ్డికి, నేటి కామారెడ్డికి మధ్య కనిపిస్తున్న మార్పులు రేపటి మరింత అభివృద్ధి చెందిన కామారెడ్డిపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.







వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవగాహన కల్పించాలి
కలెక్టర్ ఆశిష్ సంగ్వానం

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 03 (సింగిడి)





రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టం పడిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకునేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదే శించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యాన వన తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం నీటి వనరులు పరిమితంగా ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో మంచి దిగుబడి, ఆదాయం పొందగలిగే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పెసర, మినుములు, కందులు వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు సరైన మార్గదర్శనం చేయాలని ఆదేశించారు.ఆయిల్‌పామ్, కూరగాయల వంటి ఉద్యానవన పంటల సాగు ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలని తెలిపారు. బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అందేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.సాగుభూమి సంరక్షణకు అమలు చేస్తున్న 'ఖేత్ బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలని సూచించారు. పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును కూడా ప్రోత్సహించాలన్నారు.అదేవిధంగా రైతు బీమా పరిహారం పొందడంలో రైతు కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తహసీల్దార్లు మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏడీఏలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బీటీ రోడ్డు పనులపై ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక దృష్టి

కామారెడ్డి ప్రతినిధి
నవంబర్ 03 (సింగిడి)

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పెండింగ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ జగదీశ్వర్‌ను కలిసి నియోజకవర్గంలో సీఆర్ఆర్ (సిర్ ర్), ఎంఆర్ఆర్ (యమ్ ర్ ర్) నిధులతో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణ పనులపై చర్చించారు.రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకుని నాలుగైదేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రధానంగా ప్రస్తావించిన రోడ్లు:నాగిరెడ్డిపేట మండలం:– గొల్లిలింగాల, రాఘవపల్లి, ఎర్రారం, ఆత్మకూరు, బొల్లారం మీదుగా జప్తి జానకంపల్లి రోడ్డు.– తాండూర్ నుంచి మసానిపల్లి రోడ్డు.– వాడి మీదుగా చినూర్ రోడ్డు.సదాశివ నగర్ మండలం:– ఉత్నూర్ నుంచి తుక్కోజి వాడి మీదుగా భూమ్‌పల్లి రోడ్డు.– ఎన్‌హెచ్–44 నుంచి ధర్మారావుపేట మీదుగా అమర్ల బండ రోడ్డు.ఎల్లారెడ్డి మండలం:– వెల్లుట్ల మీదుగా తిమ్మారెడ్డి రోడ్డు.గాంధారి మండలం:– గాంధారి నుంచి చాడ్మల్ తండా మీదుగా పిస్కుల్ గుట్ట తండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, లోంక తండా, దాపు తండా, బీర్మల్ తండా వరకు రోడ్డు నిర్మాణం.కాంట్రాక్టుల రద్దు.. రీ–టెండరింగ్‌కు విజ్ఞప్తిసంవత్సరాల తరబడి పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్ల అగ్రిమెంట్లను రద్దు చేసి, వెంటనే రీ–టెండరింగ్ ప్రక్రియ చేపట్టాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఈ ఎన్ సిని కోరారు. ప్రజల అవసరాల కోసం మంజూరైన నిధులు వృథా కాకుండా సకాలంలో వినియోగించి, పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై సానుకూలంగా స్పందించిన ఈ ఎన్ సి జగదీశ్వర్ పెండింగ్ రోడ్డు పనుల అంశాన్ని పరిశీలించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెల్లడించింది.

కరువు దృష్ట్యా ఆరుతడి పంటల వైపు రైతులు ఆలోచన చేయాలి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 03 (సింగిడి):



సూపర్ ఎల్ నినో కారణంగా కరువు స్థితులు రాబోతున్నాయి కాబట్టి రైతులందరూ ఆరుతడి పంటల వైపు మళ్లాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి గ్రామాలతో పాటు పెద్దపల్లి పట్టణ వ్యవసాయ మార్కెట్, చందపల్లిలలో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ, సూపర్ ఎల్నినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నందున రైతన్నలు కరువు పరిస్థితిపై ఆలోచన చేయాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాసంగి సీజన్‌లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. పంట విక్రయించిన రెండు రోజుల్లోనే రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

Editorial

భారత తొలి మహిళా ఎయిర్ మార్షల్

పద్మావతి బందోపాధ్యాయ

నవంబర్ 4...పద్మావతి బందోపాధ్యాయ జయంతి

పద్మావతి బందోపాధ్యాయ (జననం. నవంబరు 4 1944) భారత దేశం లోని మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి. భారతీయ వైమానిక దళంలో తొలి మహిళా ఎయిర్ మార్షల్‌గా నిలిచి, మహిళలకు ఏదైనా సాధ్యం అన్న దిశగా మార్గం చూపారు. ఆమె సాధన, అంకితభావం, క్రమశిక్షణ ఆమెను ఇతరులకెందరో స్ఫూర్తిగా నిలిపాయి.

పద్మావతి చిన్నప్పటి నుండి దేశ సేవ చేయాలనే తపనతో జీవనం సాగించారు. 1944లో పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన ఆమె విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. 1962లో చైనా–భారత యుద్ధం ఆమె మనసులో జాతీయతా భావాన్ని మరింతగా పెంపొందించింది. ఈ సంఘటన ఆమెను తీవ్రంగా ప్రభావితం చేసి, భారత వైమానిక దళంలో చేరాలని ప్రేరణ నిచ్చింది. వైద్యంలో బోధన పొందిన తర్వాత ఆమె వైమానిక దళంలో ప్రవేశించారు.

పద్మావతి బందోపాధ్యాయ కెరీర్‌లో అనేక కీలక ఘట్టాలను అధిగమించారు. ఆమె ప్రతిభతో మహిళలందరికీ నిదర్శనంగా నిలిచారు.
1978లో డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో కోర్సును పూర్తి చేసిన మొదటి మహిళా అధికారి అనేది ఆమె సాధించిన అద్భుత విజయాలలో ఒకటి.
వైమానిక దళంలో ఏవియేషన్ మెడిసన్‌లో ఆమె నైపుణ్యాలు, ప్రతిభ మరింత మెరుగు పరిచాయి. విమాన పైలట్‌ల ఆరోగ్యం, భద్రత, మరియు సామర్థ్యాలను మెరుగుపరచడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. భారత వైమానిక దళ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ మెడికల్ సర్వీసెస్‌గా సేవలందించడం ద్వారా అధిక హోదాలోని బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు.
2002లో, ఎయిర్ వైస్ మార్షల్ హోదా పొందిన మొదటి మహిళగా చరిత్రలో నిలిచారు. వైమానిక రంగంలో మహిళలకు కొత్త నాయికగా మారారు. పద్మావతి తన సేవలకు అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. భారత దేశం తరపున దక్షిణ ధ్రువం వంటి సాహస ప్రదేశాలలో పరిశోధనలు చేసిన మొదటి మహిళగా నిలవడం గర్వకారణం. ఆమె పరిశోధన ప్రయాణం పరనశీలత, సాహసాలను సూచిస్తుంది. ఆమె వృత్తి, సేవా దృక్పథం పట్ల కట్టుబాటు భారత వైమానిక దళానికి కీలకంగా మారాయి.

పద్మావతి బందోపాధ్యాయ మహిళలందరికీ ఒక స్ఫూర్తి వంతురాలు. ఆమె చూపిన ధైర్యం, కష్టపడి పనిచేసే తీరు, అంకితభావం ఆధునిక మహిళా సాధికారతకు చిహ్నం. పాఠశాల విద్యార్థులు, యువతీయువకులు ఆమెను ఆదర్శంగా తీసుకుంటూ తన రంగాల్లో రాణిస్తున్నారు. ఆమె కృషి మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది – కష్టసాధ్యమైనా ప్రతిభతో, సమర్పణతో, మరియు పట్టుదలతో మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



ప్రపంచం యుద్ధాగ్నిలో.. భారత్‌కు ముప్పు పొంచి ఉందా?

గాజాలో బాంబుల మోత.. ఉక్రెయిన్‌లో డ్రోన్ల వేట.. అగ్రరాజ్యాల వ్యూహాల మధ్య సామాన్యుడి భవిష్యత్తు ఏమిటి?

ప్రపంచం మరోసారి అశాంతి అంచున నిలబడిందా? ఒకవైపు గాజాలో బాంబుల మోత.. మరోవైపు ఉక్రెయిన్‌లో డ్రోన్ల దాడులు.. ఇంకోవైపు అగ్రరాజ్యాల రాజకీయాలు, ఆయుధ వ్యాపారాలు, ఆధిపత్య పోరు! ఇవన్నీ చూస్తుంటే ప్రపంచం శాంతి వైపు వెళ్తోందా? లేక మరో మహా సంగ్రామానికి రంగం సిద్ధమవుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గాజాలో ఆగని రక్తపాతం.

కాల్పుల విరమణ ఒప్పందాలు, అంతర్జాతీయ చర్చలు, ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తులు.. ఏవీ గాజా ప్రజలకు సంపూర్ణ భద్రత కల్పించలేకపోతున్నాయి. ఇజ్రాయెల్ సైనిక చర్యలు, హమాస్ దాడులు, ప్రతిదాడుల మధ్య సామాన్య పాలస్తీనా ప్రజలు నలిగిపోతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస ప్రాంతాలు ధ్వంసమవుతున్నాయి. ఆహారం, నీరు, మందులు అందక ప్రజలు అల్లాడుతున్నారు.
యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర చెప్పవచ్చు. కానీ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కన్నీళ్లకు సమాధానం ఎవరు చెబుతారు?

ఉక్రెయిన్‌లో ఆకాశం నుంచి మృత్యువు..

మరోవైపు రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచానికి మరో గుణపాఠంగా మారింది. క్షిపణులు, డ్రోన్లు, ఆధునిక యుద్ధ విమానాలతో ఇరుపక్షాలు పరస్పరం దాడులు కొనసాగిస్తున్నాయి. నగరాలు ధ్వంసమవుతున్నాయి. విద్యుత్ వ్యవస్థలు, రవాణా మార్గాలు దెబ్బతింటున్నాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ యుద్ధం కేవలం రష్యా, ఉక్రెయిన్ మధ్య భూభాగ వివాదంగా మిగలలేదు. అమెరికా, ఐరోపా దేశాల సైనిక, ఆర్థిక సహకారం.. రష్యాకు ఇతర దేశాలతో ఉన్న వ్యూహాత్మక సంబంధాలు.. అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ స్పష్టత లేదు.

అమెరికా నిర్ణయాలే కీలకమా?

ఈ రెండు యుద్ధాల వెనుక అమెరికా పాత్రను విస్మరించలేం. ఉక్రెయిన్‌కు అమెరికా అందించే ఆయుధ, ఆర్థిక సహాయం యుద్ధ పరిణామాలను ప్రభావితం చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్‌కు అమెరికా అందించే దౌత్య, సైనిక మద్దతు మధ్యప్రాచ్య రాజకీయాల్లో కీలకంగా ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు ప్రపంచ రాజకీయాలపై ప్రభావం చూపగలవు. అయితే యుద్ధాల భవిష్యత్తు ఒక్క అమెరికా చేతుల్లోనే లేదు. రష్యా, ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇరాన్,



ఐరోపా దేశాల వ్యూహాలు కూడా కీలకమే.
అగ్రరాజ్యాల రాజకీయ ప్రయోజనాల మధ్య సామాన్య ప్రజల ప్రాణాలు పణంగా మారడం మాత్రం ఆందోళన కలిగించే అంశం.

భారత్‌కు యుద్ధ సెగ ఎలా తగులుతుంది?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. గాజాలోనో, ఉక్రెయిన్‌లోనో యుద్ధం జరిగితే భారత్‌కు ఏమిటి సంబంధం? మన దేశానికి వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న యుద్ధాలు మన వంటింటి బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తాయి?
చమురు ధరలపై ప్రభావం: భారత్ తన ముడి చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగితే చమురు సరఫరా మార్గాలకు ముప్పు ఏర్పడవచ్చు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరుగుతుంది. దాని ప్రభావం రవాణా, నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుంది. చివరకు కామారెడ్డిలోని రైతు ట్రాక్టర్‌కు డీజిల్ ఖర్చు పెరగడం నుంచి సామాన్యుడి ఇంటి ఖర్చుల వరకు యుద్ధం పరోక్షంగా తాకుతుంది.

రైతుకు మరో సవాల్:

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ధాన్య సరఫరా వ్యవస్థను ఇప్పటికే ప్రభావితం చేసింది. గోధుమలు, మొక్కజొన్న, వంటనూనెలతో పాటు ఎరువుల అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఒడిదుడుకులు ఏర్పడే అవకాశం ఉంది. వీటి ధరలు పెరిగితే భారత రైతుపై పెట్టుబడి భారం పెరుగుతుంది. అదే సమయంలో ప్రపంచ ఆహార మార్కెట్లో భారత వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కూడా ఏర్పడవచ్చు.
మన పిల్లల భద్రత: విదేశాల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న భారతీయులు యుద్ధ పరిస్థితుల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. వారి సురక్షిత తరలింపు, రాయబార కార్యాలయాల ద్వారా సహాయం అందించడం భారత ప్రభుత్వానికి పెద్ద బాధ్యత.

భారత్‌కు దౌత్యమే బలం!

ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఎంతో కీలకం. రష్యాతో రక్షణ, ఇంధన సంబంధాలు.. అమెరికాతో వాణిజ్య, సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామ్యం.. ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతిక సహకారం.. పాలస్తీనా ప్రజల హక్కులకు మద్దతు.. ఇలా విభిన్న దేశాలతో సమతుల్య సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం భారత్‌కు ఉంది. ఏ ఒక్క శక్తివంతమైన దేశం వైపు పూర్తిగా మొగ్గకుండా, భారత జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడమే మన దౌత్య బలం. యుద్ధాల విషయంలో చర్చలు, శాంతియుత పరిష్కారాలకే భారత్ ప్రాధాన్యం ఇవ్వాలి.

మూడో ప్రపంచ యుద్ధం తప్పదా?

గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నప్పటికీ మూడో ప్రపంచ యుద్ధం తప్పదని ఇప్పుడే నిర్ణయించడం సరికాదు. అయితే ప్రాంతీయ ఘర్షణలు ఇతర దేశాలకు విస్తరించడం, అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ భద్రతకు తీవ్రమైన ముప్పు.
చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే.. యుద్ధాలు ప్రారంభించడం సులభం.. వాటిని ముగించడం కష్టం. యుద్ధంలో విజేతలు ఉన్నా, మానవత్వం మాత్రం ఓడిపోతుంది.

గాజాలో ఆకలితో అలమటించే చిన్నారికి కావాల్సింది ఒక పూట అన్నం. ఉక్రెయిన్‌లో బాంబుల భయంతో బతుకుతున్న కుటుంబానికి కావాల్సింది భద్రత. ప్రపంచ దేశాలకు కావాల్సింది ఆధిపత్యం కాదు.. ఆర్థిక స్థిరత్వం, శాంతి, మానవత్వం. బాంబులు తయారు చేయడానికి వెచ్చించే నిధులు ఆసుపత్రుల నిర్మాణానికి ఖర్చు చేస్తే.. క్షిపణుల తయారీకి పెట్టే పెట్టుబడులు విద్య, వైద్య రంగాలకు మళ్లిస్తే ప్రపంచం మరింత సురక్షితంగా మారుతుంది. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది బాంబులు కాదు.. బ్రెడ్! డ్రోన్లు కాదు.. డాక్టర్లు! ఆధిపత్యం కాదు.. ఆత్మీయత!
యుద్ధంలో గెలిచిన దేశం గొప్పదై ఉండవచ్చు.. కానీ శాంతిని కాపాడిన ప్రపంచమే నిజమైన విజేత!



ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
వ్యాసకర్త
ణూజు (భారత అణుపరిశోధన విభాగం) ట్రైనీ సీనియర్ జర్నలిస్ట్,
9440287170.

దీపావళి వెలుగుల్లోనైనా పదవుల గ్రహణం వీడేనా?

ఇటీవల సీఈసీ వ్యవహారంపై రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రవాణా పరమైన సవాళ్లు ఎదురైనా శ్రేణులను ఢిల్లీకి సమీకరించడంలో నాయకత్వం చూపిన చొరవ పార్టీ సంస్థాగత శక్తిని మరోసారి చర్చకు తెచ్చింది. ఈ కార్యక్రమంతో శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినా, నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం నిరీక్షణ కొనసాగుతోంది. సంక్రాంతి, ఉగాది, దసరా గడిచాయి. ఇప్పుడు దీపావళి వచ్చింది. పండుగలు



మారుతున్నా పదవులపై ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ముగియడం లేదు. ప్రతి పండుగకు ముందు ప్రకటనపై ఆశలు పెరిగి, చివరకు స్పష్టత రాకపోవడం వెనుక రాజకీయ లెక్కలేమిటి? పేర్లు ఖరారయ్యాయా? అధిష్ఠానం ఆమోదం కోసమే జాప్యమా? లేక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. అక్టోబర్ 10న వెలువడిన సమాచారం ప్రకారం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తిచేసి పేర్లను అధిష్ఠానానికి పంపినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన రావచ్చన్న సంకేతంతో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వ నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ సంస్థాగత నియామకాల పైనా నిర్ణయాలు వెలువడాల్సి ఉండటంతో నాయకత్వం తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ.. అసలు లెక్క ఎప్పుడు తేలుతుంది?

కార్పొరేషన్లు, సహకార సంస్థలు, మార్కెట్ కమిటీలు, సంక్షేమ సంస్థల్లో చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 22న వెలువడిన నివేదిక ప్రకారం, సుమారు 50 కొత్త నియామకాలతోపాటు పదవీకాలం ముగిసిన మరో 30కి పైగా స్థానాలు కలిపి దాదాపు 80 పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో ప్రచారంలోకి వచ్చిన 87 పోస్టుల అంచనాతో ఈ సంఖ్య సరిపోకపోవడంతో అసలు ఖాళీలపై స్పష్టత అవసరమైంది. ఆర్టీసీ, పౌర సరఫరాలు, మూసీ రివర్‌ఫ్రంట్, పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు చెందిన సంస్థల్లో నియామకాలపై ఆసక్తి నెలకొంది. పదవీకాలం ముగిసిన సుమారు 37 మంది కార్పొరేషన్ చైర్మన్ల స్థానాల భర్తీపైనా నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. అయితే ఈ సంఖ్యలను అధికారికంగా ప్రకటించిన తుది ఖాళీలుగా భావించరాదు. కొందరు గతంలో నిర్వహించిన పదవులను కొనసాగించాలని ఆశిస్తుండగా, మరికొందరు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 14న దసరా నాటికి నియామకాలు చేపట్టే అవకాశంపై సంకేతాలు వెలువడగా, అక్టోబర్ 18న వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని, దసరాకు ముందే ప్రకటన ఉండకపోవచ్చని నాయకత్వం తెలిపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. గడువుపై భిన్నమైన సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రచారంలో ఉన్న అంచనాల కంటే ఖాళీల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, నియామకాల గడువును వెల్లడించడం ముఖ్యం.

పాత అనుభవం.. కొత్త రాజకీయ బలం.. సమతుల్యత ఎలా?

పదవుల పంపిణీ కాంగ్రెస్ నాయకత్వానికి కీలక పరీక్షగా మారింది. ప్రతిపక్షంలో పదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన నాయకులు, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో శ్రమించిన కార్యకర్తలు తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కూడా తమ రాజకీయ అనుభవం, ప్రజాబలం ఆధారంగా బాధ్యతలు కోరుతున్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అండగా నిలిచినవారికి ప్రాధాన్యమిస్తూనే కొత్తగా చేరినవారికి అవకాశాలు కల్పించడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం నాయకత్వం ముందున్న సవాలు. ఆగస్టు 23న నిజామాబాద్‌లో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసినవారికి 70 శాతం నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని, కొత్తగా వచ్చినవారికీ ప్రాతినిధ్యం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఆగస్టు 24న కూడా పార్టీ కోసం నిరంతరం శ్రమించినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని, గత మూడేళ్లలో అందరికీ తగిన అవకాశాలు లభించలేదన్న అసంతృప్తిని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ప్రకటనల్లో వ్యక్తమైన ప్రాధాన్యం ఎంపికల్లోనూ ప్రతిబింబించాలి. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతోపాటు జిల్లా, నియోజకవర్గ కమిటీల నియామకాలు పూర్తికాకపోవడం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం ఎదురుచూస్తున్న కొందరు నేతలు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల పైనా ఆశలు పెట్టుకున్నట్లు నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. ఒకే బాధ్యత కోసం పలువురు పోటీపడుతున్న వేళ పార్టీ సేవలు, రాజకీయ అనుభవం, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యతకు ఏ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇస్తారన్నది కీలకం.

కేడర్ ఆశలకు వెలుగునివ్వడం నాయకత్వ బాధ్యత!

నామినేటెడ్ పదవులు కేవలం హోదాలు కావు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం పెంచడం, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావడం వంటి బాధ్యతలు వాటితో ముడిపడి ఉంటాయి. నియామకాల జాప్యం కొనసాగితే ఆశావహుల నిరీక్షణతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల ఉత్సాహంపైనా ప్రభావం పడవచ్చు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పీసీసీ కార్యవర్గ విస్తరణ, జిల్లా--నియోజకవర్గ కమిటీల ఏర్పాటు, కార్పొరేషన్ పదవుల భర్తీని సమన్వయంతో పూర్తిచేస్తే శ్రేణులకు స్పష్టమైన సందేశం అందుతుంది. అర్హత, పార్టీ సేవలు, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యత ఆధారంగా ఎంపికలు చేపట్టి నిర్దిష్ట గడువును ప్రకటించాలి. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన వస్తుందన్న సంకేతాలు కార్యరూపం దాలుస్తాయా? మూడేళ్లుగా ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కుతుందా? బాధ్యతలు చేపట్టేవారు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతవరకు కృషి చేస్తారన్నది కూడా ఎంపికలతోపాటే తేలాలి. ఎన్నికల సమయంలో కార్యకర్తల శ్రమతో అధికారాన్ని అందుకున్న పార్టీ, పాలనలోనూ వారి భాగస్వామ్యానికి తగిన విలువ ఇవ్వాలి.

-వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464

చితికి నిప్పంటించి..!

నేటి నీ ఘన విజయాన్ని..
చాటింపు చేయాల్సిన పనిలేదు
మొక్క కూడా నిశ్శబ్దంగానే...
ఎదిగి వృక్షమై నీడను పంచుతుంది !

శ్మశాన ఫలకంపై రాసి ఉంది..
జీవితంలో కష్టపెట్టిన వాళ్లే..
శ్మశానం దాకా మోసుకొచ్చారు..
చితికి నిప్పంటించి వెళ్లిపోయారు !

అందరికీ సహాయం చేసినోళ్లు..
ఎవ్వరినీ నోప్పించని వాళ్లు...
నిజాన్ని నిర్భయంగా చెప్పినోళ్లు...
ప్రశాంతంగా ఉన్న దాఖలాలు లేవు !

డెబ్భై కిలోల శరీరంపై..
క్వింటాల్ల కొద్ది బరువు మోసే వాడు..
ఎవరో కాదు ఇంటి యజమాని..
ఎంత అలసినా విశ్రాంతి కోరడు !

మధుపాళీ
9949700037





ఊర చెరువు అక్రమ గోడౌన్‌ను కూల్చివేయాలి

కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నేతల ఫిర్యాదు

కరీంనగర్, నవంబర్3(నినాదం)

నగరంలోని 17వ డివిజన్ పరిధిలో ఊర చెరువు పూర్తి నీటిమట్టం పరిధిలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌ను వెంటనే కూల్చివేసి చెరువును పరిరక్షించాలని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కేంచ శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.మున్సిపల్ అనుమతులు లేకుండా సర్దం శ్రీనివాస్, మల్లేశం, రాజు గోడౌన్ నిర్మించారని, గతంలో అధికారులు నోటీసులు జారీ చేసి ఇంటి నంబర్‌ను రద్దు చేసినప్పటికీ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించలేదని తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన అధికారులు సంబంధిత శాఖలతో సమీక్షించి అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు శేఖర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్తునూరి హరీష్, జేరిపోతుల శ్రీకాంత్, దుబాయ్ సునీల్, ఎస్. రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో స్విమ్మింగ్ పూల్ పనుల పరిశీలన...

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి...
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 03 (సింగిడి) : జిల్లాలో విద్యకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టి జి ఇ డబ్ల్యూఐ డిసి) ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన బిల్లుల విడుదలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, విద్యాశాఖ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల ప్రస్తుత పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిజిఇడబ్ల్యూఐడిసి డిప్యూటీ ఈఈ రామకృష్ణ, టెక్నికల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చిహ్నాన్ని తొలగించడంపై బీఆర్ఎస్ ఆగ్రహం!

పైలాన్ తొలగింపును అడ్డుకున్న రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి.. పోలీసుల అదుపులోకి తీసుకొని జైపూర్ స్టేషన్కు తరలింపు



గోదావరిఖని నవంబర్ 03 (సింగిడి) బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను మున్సిపల్ అధికారులు తొలగించడంపై రాజకీయ వివాదం చెలరేగింది. లేబర్ కోర్టు చౌరస్తాలో ఉన్న అభివృద్ధి పైలాన్ తొలగింపు చర్యను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ పైలాన్‌ను ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అలాంటి అభివృద్ధి గుర్తును తొలగించడం సమంజసం కాదని హరీష్ రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కారణాలతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఆనవాళ్లను చెరిపివేయాలని చూడటం సరికాదని అభిప్రాయపడ్డారు.పైలాన్ తొలగింపును నిరసిస్తూ ఆందోళన చేపట్టిన హరీష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన నాయకుడిని అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి.రామగుండం అభివృద్ధికి సంబంధించిన గుర్తులను తొలగించడం ద్వారా గతంలో జరిగిన అభివృద్ధిని ప్రజల నుంచి దాచలేరని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజాధనంతో నిర్మించిన అభివృద్ధి కట్టడాలను తొలగించడం సరైన విధానం కాదని విమర్శించారు.అభివృద్ధి పనుల గుర్తులను కాపాడాలని, పైలాన్ తొలగింపు చర్యలపై అధికారులు పునరాలోచించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమాలు!

ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశం!
అక్రమ వసూళ్లు, టెండర్లు, నియామకాలపై ఆరా.. గడువులోగా నివేదిక ఇవ్వాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 03 (సింగిడి)



ఆరోపణలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు.. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాంకామారెడ్డి, నవంబర్ 3: కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమ వసూళ్లు, పాలనా పరమైన అవకతవకలు జరుగుతున్నాయంటూ ఇటీవల పలు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు.పలు అంశాలపై సమగ్ర విచారణమున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన టెండర్ల ప్రక్రియ, పారిశుద్ధ్య సిబ్బంది నియామకాలు, వారి హాజరు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు పనులు, ఆయా పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యంపై వచ్చిన ఆరోపణలను విచారణలో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.అదేవిధంగా పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నోటీసులు, వాటిపై తీసుకున్న చర్యలు, మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశాల నిర్వహణ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, అనంతరం వాటి విక్రయానికి సంబంధించిన వివరాలను సైతం పరిశీలించనున్నారు.మున్సిపల్ వాహనాల నెలవారీ ఇంధన వినియోగం, వ్యాపార అనుమతుల జారీ, ఇంటి పన్ను మదింపు ప్రక్రియ తదితర అంశాలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయనున్నారు.ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలుఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి అవకతవకలు, అక్రమ వసూళ్లు జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఫిర్యాదులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చని తెలిపారు.ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి
రోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

రాజన్న సిరిసిల్ల,ప్రతినిధి నవంబర్ 03: (సింగిడి)



రుద్రంగి మండలం మానాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పది నిమిషాల కార్యక్రమం నిర్వహణా అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరో వాటర్ యంత్రం పనితీరు, ఫ్యాన్లు, లైట్లు పరిశీలించారు. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా, తనిఖీ చేశారు. తరగతి గదులు సైతం పరిశీలించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ప్రతి మంగళవారం పది నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి పదవ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. నీటిని వేడి చేసి.. చల్లార్చి తాగించాలని తెలిపారు. టాయిలెట్ వెళ్లిన తరువాత పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు ఇతర ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి.. మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని, మందులు అందించాలని ఆదేశించారు. గర్భిణులు నార్మల్ డెలివరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి.రక్త హీనతతో ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలల ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేకత పెట్టారని తెలిపారు.ఎదుగుదల లోపాలు గల పిల్లలకు డీఈఐసీ కేంద్రంలో పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడాలని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రి లోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. అలాగే కరీంనగర్ లో ఎన్ ఆర్ సీ కేంద్రంలో సేవలు అందిస్తారని, ఉన్నత వైద్య సేవలు హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు. మానాలలోని టీజీ టీ డబ్ల్యూ యూ ఆర్ జే సీ గర్ల్స్ విద్యాలయంలో విద్యుత్, నీటి సరఫరా పనులు పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్ నగర్ రైతుల సమస్య పరిష్కారానికి అధికారుల పరిశీలన



మానకొండూర్, నవంబర్03(సింగిడి)

శ్రీనివాస్ నగర్ గ్రామంలోని రైతులు అండర్‌పాస్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ మేకల మహేందర్‌తో కలిసి సంబంధిత అధికారులకు విన్నవించారు.రైతుల విజ్ఞప్తికి స్పందించిన ఎన్ హెచ్ -563 ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్ గ్రామానికి చేరుకుని అండర్‌పాస్ సమీపంలోని డ్రైనేజీ సమస్యను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు వివరించగా, సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని భరద్వాజ్ హామీ ఇచ్చారు.దీంతో రైతులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభివృద్ధిపై చర్చకు సిద్ధం..
కాంగ్రెస్ నేతలు సిద్ధమేనా?

గోదావరిఖని నవంబర్ 03 (సింగిడి):



గ్రామాల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను కాదని మాట్లాడటం వాస్తవాలను మరుగునపరచడమేనని బీఆర్ఎస్ యువ నాయకుడు అలిశెట్టి రవి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీపై గోలివాడ గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన కాంగ్రెస్ నాయకులకు గట్టి సమాధానమిచ్చారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక మౌలిక సదుపాయాలను కల్పించిందని రవి పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. ముఖ్యంగా గోలివాడ గ్రామంలో గత పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆధారాలతో సహా వివరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఏమిటో నాయకులు వెల్లడించాలని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితి ఏమిటని నిలదీశారు. ప్రతిపక్షంపై విమర్శలు చేయడానికి చూపిస్తున్న ఆసక్తిలో కొంతైనా గ్రామాల అభివృద్ధిపై చూపించాలని హితవు పలికారు.సర్పంచ్ హోదాలో ఉన్న వ్యక్తులు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా గ్రామ ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. గతంలో జరిగిన అభివృద్ధిని తక్కువ చేసి చూపడం వల్ల వాస్తవాలు మారవని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటుందని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల తరఫున పోరాడుతుందని అలిశెట్టి రవి పేర్కొన్నారు.గతంలో ఎవరు పనిచేశారు.. ఇప్పుడు ఎవరు పనిచేస్తున్నారు అనేది మాటలతో తేలేది కాదు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన ప్రయోజనాలే పాలనకు నిదర్శనం. ఆ విషయంలో బహిరంగ చర్చకు మేము ఎప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు.

గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్రభుత్వ భవనాల పూర్తికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం

కరీంనగర్, నవంబర్3(సింగిడి)



సమగ్ర గ్రామీణ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ భవనాలు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, గ్రామీణాభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో మహిళా సమాఖ్య భవనాలు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అర్హులైన వారికి చేయూత పింఛన్లు అందేలా దరఖాస్తుల పరిశీలన, జాతీయ కుటుంబ సహాయ పథకం పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.గ్రామీణ ఉపాధి పనులను ముమ్మరం చేసి కూలీల హాజరు పెంచాలని, ఎంపీడీవోలు ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, పొలాల్లో నీటి కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం!



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి):

ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందనతో పాటు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం లోనూ 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ కుటుంబం మానవతా దృక్పథాన్ని చాటుకుంది.వనపర్తి పట్టణంలోని 22వ వార్డు మసీదు రోడ్డులో బోరు మోటార్ పాడవడంతో స్థానిక ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ వెంటనే స్పందించి తన భర్త మెకానిక్ శ్రీను సహకారంతో కొత్త బోరు మోటారును ఏర్పాటు చేయించారు. దీంతో స్థానిక ప్రజలకు నీటి కష్టాలు తొలగి ఉపశమనం లభించింది.ఇదిలా ఉండగా అదే వార్డు పరిధిలోని గణేష్ నగర్ వీధికి చెందిన వడ్డే కురుమన్న అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఏర్వ అరుణ భర్త మెకానిక్ శ్రీను మానవతా హృదయంతో స్పందించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఒకవైపు నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మరోవైపు కష్ట కాలంలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడంతో కౌన్సిలర్ ఏర్వ అరుణ పలువురి అభినందనలు అందుకుంటోంది.

భూ సర్వే కోసం ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు



మానకొండూర్, నవంబర్03(సింగిడి)

మండల పరిధిలోని వన్నారం గ్రామంలో భూముల రీసర్వేలో భాగంగా గత శనివారం గ్రామానికి చెందిన మేల్లకుంటను సర్వే చేయడం జరిగింది.ఈ సర్వేలో గుర్తించిన మేల్లకుంటకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ పరంపోగు భూమికి గ్రామ సర్పంచ్ తాళ్ల సంపత్ ఆధ్వర్యంలో హద్దు రాళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే సోమవారం రోజున గుర్తుతెలియని వ్యక్తులు ఆ హద్దు రాళ్లను పీకివేయడంతో పాటు విరగొట్టినట్లు గ్రామస్థుల దృష్టికి వచ్చింది.ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించిన వ్యక్తులను గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను గ్రామ సర్పంచ్ తాళ్ల సంపత్ కోరారు.

అయోధ్య రామ మందిరం నమూనా ప్రదర్శన ప్రారంభం

వావిలాలపల్లిలో ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాల సమాహారం... ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, నవంబర్3(సింగిడి)

నగరంలోని వావిలాలపల్లిలో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిరం ఇతివృత్త ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య రామ మందిరం నమూనాతో పాటు ఇండియా గేట్, గేట్‌వే ఆఫ్ ఇండియా, వాఘా సరిహద్దు వంటి జాతీయ ప్రతీకలను ప్రదర్శనలో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ సభ్యులు, చిన్నారులకు వినోదాన్ని అందించేలా ప్రదర్శనను రూపొందించారని తెలిపారు. నగర ప్రజలు సందర్శించి విజయవంతం చేయాలని కోరారు.నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ నమూనాతో పాటు జెయింట్ వీల్, కొలంబస్, చిన్నారుల కార్ల పోటీలు, ఆటల విభాగాలు, దుకాణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రదర్శన సందర్శనకు ప్రవేశ రుసుము ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారి వేణు, వైద్యుల అంజన్ కుమార్, నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

భూభారతి - రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట, నవంబర్3(సింగిడి)

భూముల సర్వే చేశాక భూ యజమానులకు సర్వే వివరాలను తెలియజేయాలని, అనుమానం ఉంటే మళ్ళీ సర్వే చేసి భూ యాజమానుల సందేహాలను నివృత్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి సర్వేయర్ లను ఆదేశించారు.మంగళవారం బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలో భూ భారతి రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా భూభారతి – రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ముందుగా చిన్న గ్రామాలను ఎంచుకొని గ్రామంలో భూ సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దరంలో సులువుగా ఉంటుందని అందుకే వీరాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, ఈ గ్రామం మొత్తం 557 ఎకరాలు మొత్తం సర్వే చేయడం జరుగుతుందని రైతులకు సూచించారు. ముందుగా గ్రామ సరిహద్దు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, ఖాళీ బాటలను సర్వే చేశాక పట్టా భూములను సర్వే చేయడం జరుగుతుందని, పట్టా భూములను సర్వే రోజుకు రెండు రోజుల ముందుగానే ఆయా భూ యజమానులకు– రైతులకు సమాచారం అందించాలని సర్వే అధికారులను ఆదేశించారు.క్షేత్ర స్థాయిలో లైసెన్స్ సర్వేయర్, జిపిఓ, రెవెన్యూ అధికారులు రోజువారిగా 35 నుండి 40 ఎకరాలు సర్వే చేస్తారని, భూ సర్వే చేశాక భూ యజమానికి సర్వే వివరాలను తప్పనిసరిగా తెలుపాలని, ఏమైనా అనుమానం ఉంటే మళ్ళీ ఒకసారి సర్వే చేసి భూ యజమానులకు సందేహాలు లేకుండా నివృత్తి చేయాలని సర్వేయర్ లను ఆదేశించారు. ఓకే భూ యజమానికి ఒకే చోట పలు సర్వే నంబర్లలో భూమి ఉన్నట్లయితే వారికి భూ భారతి చట్టంలో ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రైతులు– భూ యజమానులకు ఈ రీ సర్వేకు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భూమి కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకున్నాకే కొనుగోలు జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, సర్వే అధికారులు రైతులు భూ యజమానులు తదితరులు ఉన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

సిద్దిపేట, నవంబర్3(సింగిడి)



బెజ్జంకి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్.. అన్నం, సాంబారు, మిల్ మేకర్ కూ రలను పరిశీలిస్తూ కూరల నాణ్యత ఎలా ఉంది, రోజు మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా, విద్యార్థులకు సరిపోయేంత పెడుతున్నారా అని ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థుల హాజ రు ప్రకారం సరుకులు కూరగాయలు పర్యవేక్షణ చేస్తూ రుచికరంగా వండే విధంగా వంట సిబ్బంది తెలుపాలని, వండిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపడే విధంగా పెట్టాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. డైనింగ్ హాల్లో విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ ఆహారం రుచిగా ఉందా, గుడ్డు పెడుతున్నారా, సరిపోయిందా పెడుతున్నారా అని అడగ్గా, నిన్నటి రోజున ఏం కూరతో తిన్నారని ఆరా తీశారు. బాగా తినాలని ఆహారం బాగా తీసుకుంటేనే శారీరకంగా బలంగా ఉండి చదువుకోడానికి మానసికంగా దృఢంగా ఉంటారని సూచించారు. పాఠశాల వెనకాల పిచ్చి మొక్కలు చెత్తాచెదారం ఉన్నందున గ్రామపంచాయతీ సిబ్బందిని నెలకొకసారి వచ్చి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కి సూచించారు. పాఠశాల వాతావరణం చాలా బాగా ఉందని విద్యార్థులకు చదువు, భోజనం విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ప్రిన్సిపల్ ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అధికారుల నిర్లక్ష్యం..

బోర్డులపై పేర్లు రాయడానికి ఇబ్బంది ఎవరికి..! పారదర్శకతకు పాతరేస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారుల తీరుపై విమర్శలు

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి):

ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకమైన పాలన అందించేందుకు, అధికారుల జవాబుదారీతనాన్ని పెంచేందుకు తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం అమలులోనే నిర్లక్ష్యం కనిపిస్తే ఇక ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులపై అధికారుల పేర్లు పూర్తిస్థాయిలో రాయకపోవడం చర్చనీయాంశంగా మారింది.–బోర్డులపై కొందరి పేర్లే.. మిగతావి ఎక్కడ?సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు, సమాచార అధికారుల వివరాలను కార్యాలయాల్లో స్పష్టంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. అయితే వనపర్తి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బోర్డులపై కొన్ని పేర్లు మాత్రమే రాసి, మిగతా పేర్లను రాయకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. ఒకే చోట పంచాయతీరాజ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలు మూడు ఉన్నాయి. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ వనపర్తి, పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పెద్దమందడి, పంచాయతీరాజ్ విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. పంచాయతీరాజ్ విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేశారు. అందులో



సహాయ పౌర సమాచార అధికారి పేర్లు రాయలేదు. పంచాయతీరాజ్ పెద్దమందడి సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న స.హ. చట్టం బోర్డులో పౌర సమాచార అధికారి పేరు రాయలేదు. పంచాయతీరాజ్ వనపర్తి సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న స.హ. చట్టం బోర్డులో పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు రాయలేదు. ఒకే చోట ఉన్న ఈ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డుల్లో పేర్లు లేకుండా ఉన్న బోర్డులు వచ్చి పోయే వారికి దర్శనమిస్తున్నాయి.బోర్డులపై పేర్లు రాయడంలో ఇబ్బంది ఏమిటి? సంబంధిత అధికారుల వివరాలు పూర్తిస్థాయిలో ప్రదర్శించకపోవడానికి కారణాలేంటి? సమాచార హక్కు చట్టం అమలుపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఈ అంశాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రజలకు సమాచారం అందించాల్సిన వారే నిర్లక్ష్యం చేస్తే..!

సమాచార హక్కు చట్టం అనేది కేవలం కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయడం, వాటిపై కొన్ని పేర్లు రాయడం కోసం తీసుకొచ్చిన చట్టం కాదు. ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజలకు సమాచారాన్ని అందించడం, అధికారులను జవాబుదారీగా నిలపడం దీని ప్రధాన ఉద్దేశం. అలాంటి చట్టం అమలులోనే అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుంది? తమకు అవసరమైన సమాచారం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఏర్పడితే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కు కాగితాలకే పరిమితమవుతోందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల మౌనం ఎందుకో..?

పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులపై పేర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంపై సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. బోర్డులపై పేర్లు రాయడం పెద్ద పనేమీ కాకపోయినా దానిని నిర్లక్ష్యం చేయడం మాత్రం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంచాల్సిన అధికారులు ముందుగా తమ కార్యాలయాల్లోనే సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించలేకపోతే పారదర్శక పాలనకు అర్థమేమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి

వనపర్తి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి సంబంధిత కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు అధికారుల పేర్లు, హోదాలు, సంప్రదింపు వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.సమాచార హక్కు చట్టం అమలు అనేది అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే అంశం కాదు. అది ప్రజలకు చట్టం కల్పించిన హక్కు. ఆ హక్కును గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ), పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) లు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులపై అధికారుల పేర్లు రాయించాలని, నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

బీటీ రోడ్లపై మృత్యుపాశాలుగా ఎండిన చెట్లు..!

రహదారులపైకి వాలుతున్న కంపచెట్లు.. ప్రమాదాలకు మలుపు ...ప్రధాన రహదారులపై సూచిక బోర్డులు కరువు.. ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి):

వనపర్తి జిల్లాలోని ప్రధాన బీటీ రహదారులపై వాహనదారుల భద్రత గాలిలో దీపంలా మారింది. రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు రహదారులపైకి వాలుతుండగా, ఎండిపోయిన చెట్లు ఎప్పుడు కూలిపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు గ్రామాల వద్ద, ప్రమాదకర మలుపులు, కల్వర్టుల సమీపంలో అవసరమైన సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై గోతులు పడి వాహనాలు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నా ఆర్ అండ్ బి అధికారులకు ఇవేమీ పట్టడం లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.జిల్లాలోని పలు ప్రధాన రహదారుల వెంట ఎండిపోయిన చెట్లు, రహదారి వృక్షాలు రోడ్లపైకి వాలి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. గాలివానలకు కొమ్మలు విరిగిపడినా, చెట్లు కూలినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా అడ్డు పడుతున్నాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం కష్టంగా మారుతోంది. రాత్రివేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు–రోడ్లపై సూచిక బోర్డులు ఎక్కడ..?ప్రధాన రహదారులపై గ్రామాల ప్రవేశ మార్గాలు, ప్రమాదకర మలుపులు, కల్వర్టులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద ముందస్తు హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. గతంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు తొలగిపోవడం, ఒరిగి ఉండడం, వాహనదారులకు కనపడకుండా చెట్లు కమ్మేయడంతో ఆందోళనకు గురిచేస్తోంది. కొత్తగా ఆ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదకర మలుపులను గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు.–ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?రోడ్ల నిర్వహణ, రహదారుల పక్కన పెరిగిన చెట్ల తొలగింపు, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు నిరంతరం చేపట్టాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే పర్యవేక్షణ కొరవడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు రోడ్లపై కంపచెట్లు, ఎండిన చెట్లు, రహదారి వృక్షాలు రోడ్లపైకి వాలి ప్రమాదకరంగా ఉండటం, సూచిక బోర్డులు లేకపోవడం, రోడ్లపై పెద్ద గుంతలు పడటం, రోడ్లపైకి మట్టి చేరటం తదితర సమస్యలను గుర్తించాల్సి ఉంది. కానీ అధి



కారులు కార్యాలయాలకు పరిమితం అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారులపైకి వాలిన కంపచెట్లను తొలగించాలని, ఎండిపోయిన చెట్లను గుర్తించి ప్రమాదాలు జరగకముందే తొలగించాలని, అవసరమైన ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేసే బదులు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు





చెరువుల అలుగుల పటిష్టతకు చర్యలు

మనిగిల్లలో చెరువుల మరమ్మతులు, పూడికతీత పనులకు శ్రీకారం వచ్చే సోమవారం నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభం

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి):

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని చెరువులను పటిష్టం చేసేందుకు పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని వెంకన్న చెరువు, చౌట చెరువు అలుగులు, అచన్న కాలువ అలుగు మరమ్మతులు, రెండు చెరువుల కట్టలపై జంగిల్ కటింగ్, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.అలాగే గ్రామ ప్రజలకు స్థానికంగా పనిదినాలు కల్పించడంతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి హామీ పథకం కింద వచ్చే సోమవారం నుంచి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో మంగళవారం సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఈసీ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు రామ్ రెడ్డి,



వెంకటరెడ్డితో కలిసి రెండు చెరువుల కట్టలు, అలుగులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేపట్టాల్సిన మరమ్మతులు, పూడికతీత పనులపై అధికారులతో చర్చించారు.చెరువుల పటిష్టతతో వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని, ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి కూడా లభించనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, మల్లి కార్జున్, ప్రేమ్ కుమార్ రెడ్డి, బోడి గణేష్, తిరుపతయ్య, బాలకృష్ణ, బలరాం యాదవ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



పైలాన్ తొలగింపు వెనుక కక్షసాధింపు రాజకీయాలు!

దళిత బహుజన నేతల చరిత్రను చెరిపేయాలనే ప్రయత్నం సరికాదురోడ్డు ప్రమాదాల పేరుతో తొలగింపులకు పాల్పడటం అన్యాయం.. పాలకుల తీరుపై నగునూరి సుమలత రాజు ఆగ్రహం

గోదావరిఖని: నవంబర్ 03 (సింగిడి):

రామగుండం అభివృద్ధికి గుర్తుగా నిలిచిన పైలాన్, శిలాఫలకాల తొలగింపు చర్యలు ఏమాత్రం సమర్థనీయం కావని నగునూరి సుమలత రాజు తీవ్రంగా ఖండించారు. రోడ్డు ప్రమాదాల నివారణ పేరుతో పైలాన్‌ను తొలగించాలనుకోవడం వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. గతంలో ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు, వారి సేవలను ప్రజలకు కనిపించకుండా చేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.రామగుండం ప్రాంత అభివృద్ధిలో దళిత, బహుజన ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించారని, వారి కృషికి గుర్తింపుగా నిలిచిన పైలాన్, శిలాఫలకాలను తొలగించడం వారి ఆత్మగౌరవాన్ని కించపరిచినట్లేనని సుమలత రాజు అన్నారు. గతంలో దళిత మేయర్, దళిత ఎంపీ, బహుజన కార్పొరేటర్లు ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాముల య్యారని గుర్తుచేశారు. రాజకీయాలు మారినంత మాత్రాన చరిత్రను, ప్రజాప్రతినిధుల సేవలను చెరిపేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.పైలాన్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే కారణం చూపుతున్న అధికారులు, ప్రమాదాలు చోటుచేసుకున్న ఇతర ప్రాంతాలపై కూడా ఇదే విధమైన చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. రామగుండం మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ప్రమాదాల్లో కార్పొరేటర్ భర్తతో పాటు కార్యాలయ కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ప్రస్తావించారు. అలాగే గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరాగాంధీ విగ్రహం ప్రాంతంలోనూ అనేక ప్రమాదాలు జరిగాయని గుర్తుచేశారు. ఆ ప్రాంతాల్లోనూ నిర్మాణాలను తొలగిస్తారా? లేక పైలాన్ విషయంలోనే ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారా? అని నిలదీశారు.గత పాలకుల అభివృద్ధి పనులకు ఇవే సాక్ష్యాలు, ప్రజా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని సుమలత రాజు పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కళాశాల ఏర్పాటుతో పాటు కార్పొరేషన్‌కు సుమారు రూ.350 కోట్ల నిధులు మంజూరయ్యేలా కృషి చేశారని తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఈఎస్ఐ ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులకు అనుమతులు తీసుకురావడంలో గత ప్రజాప్రతినిధుల పాత్ర ఉందన్నారు.

రోజూ గుప్పెడు తింటే బ్రెయిన్ కత్తిలా ...



బాదంతో బరాబర్.. ఫుల్లుగా విటమిన్లు, ప్రోటీన్లు.. మన వంటకాల్లో వేరుశనగలు (పల్లీలు) సాధారణంగా వాడే పదార్థమే అయినప్పటికీ, వీటిలో ఉండే పోషకాలు ఆరోగ్యాన్నే కాకుండా మెదడు పనితీరును కూడా మెరుగుపరుస్తాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పల్లీలు తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు వృద్ధాప్యంలో వచ్చే మానసిక సమస్యలను దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పల్లీల్లోని పోషకాలు – ఆరోగ్య లాభాలు:

పోషకాల నిధి:
బాదం పప్పులకు సమానమైన పోషకాలు పల్లీలలో లభిస్తాయి. అందుకే పల్లీలను పేదవారి బాదం అని పిలుస్తారు. తక్కువ ధరకు బాదం పప్పులో ఉండే పోషకాలు ప్రొటీన్లు, విటమిన్లు పల్లీల్లో కూడా లభిస్తాయి.. బాదం పప్పుతో సమానమైన ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు పదార్థాలు ఇందులో ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో పల్లీలు చాలా బాగా సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. పల్లీల్లో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతోపాటు ఫైబర్, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫోలేట్ మరియు 'అర్జినైన్' అనే అమైనో ఆసిడ్ పుష్కలంగా ఉంటాయి.

గుండెకు రక్షణ: పల్లీలు తీసుకోవడం ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అలాగే రక్తంలో గ్లైసెమిక్ నియంత్రణకు ఇవి తోడ్పడతాయి.

మెదడు ఆరోగ్యంపై పల్లీల ప్రభావం
నెదర్లాండ్స్‌లోని మాస్ట్రిచ్ట్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. రోజూ పల్లీలు తినడం వల్ల వృద్ధులలో మెదడు పనితీరు మెరుగవుతుందని తేలింది. 60 నుంచి 75 సంవత్సరాల వయసు గల 31 మందిపై 16 వారాల పాటు ఈ పరిశోధన జరిపారు. ప్రతిరోజూ 60 గ్రాముల వేరుశనగలు తిన్నవారిలో సెరిబ్రల్ రక్త ప్రసరణ (జవతీవఎఝీశ్రీ దీశ్రీశీశీఎ ఖీశ్రీశీఎ) 3.6 శాతం పెరిగినట్లు, వెర్బల్ మెమరీ పనితీరు 5.8 శాతం మెరుగైనట్లు గుర్తించారు. పల్లీలలోని అసంతృప్త కొవ్వులు, పీచు పదార్థం, విటమిన్లు మరియు ఫైటోకెమికల్స్ నాడీ కణాల మధ్య అనుసంధానాన్ని పెంచి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. దీనివల్ల అల్జీమర్స్ వంటి సమస్యల ముప్పు కూడా తగ్గుతుంది.

పల్లీలను ఏ విధంగా తినాలి?

వేరుశనగలతో లాభాలున్నాయి కదా అని నూనెలో వేయించినవి, ఉప్పు లేదా కారం కలిపిన పల్లీలను ఎక్కువగా తింటే ఆరోగ్యానికి ప్రయోజనానికి బదులు క్యాలరీలు పెరుగుతాయి. ఎటువంటి ఉప్పు కలపకుండా, తొక్కతీసి వేయించిన పల్లీలను తీసుకోవడం వల్ల మెదడుకు పూర్తి ప్రయోజనం దక్కుతుంది. అంతేకాకుండా.. నానాబెట్టిన పల్లీలను గుప్పెడు తీసుకోవడం చాలా మంచిది.

పల్లీలతో పాటు రోజూ శారీరక శ్రమ చేయడం, పజిల్స్ పూరించడం, కొత్త విషయాలు నేర్చుకోవడం వంటి అలవాట్లు ఉంటే మెదడు మరింత చురుగ్గా మారుతుంది. అయితే.. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

జలుబు, దగ్గుకు చెక్ పెట్టే
మిరియాల పులిహోర



ముందుగా, గింజలు లేని 50 గ్రాముల చింతపండును 300 మిల్లీలీటర్ల నీటిలో నానబెట్టాలి. రెండు కప్పుల (సుమారు 185 గ్రాములు) బియ్యాన్ని కడిగి కుక్కర్‌లో వేయాలి.
దీనికి నాలుగు కప్పుల నీళ్లు, 2 1/4 టేబుల్ స్పూన్ల ఉప్పు, ఒక టీ స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ నువ్వుల నూనె కలిపి, హై ఫ్లేమ్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు వండాలి. అన్నం మెత్తబడకుండా ఉండటానికి, స్టీమ్ పోయిన వెంటనే మూత తీసి, ఒక ప్లేట్‌కు నువ్వుల నూనె రాసి, అన్నాన్ని దానిపై వేసి పూర్తిగా చల్లారనివ్వాలి. అన్నం పొడిపొడిగా ఉండటం పులిహోర రుచికి ముఖ్యం.

అదే పాన్ లో అర టీ స్పూన్ మెంతులు, ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, రెండు టేబుల్ స్పూన్ల మిరియాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర వేసి, సన్నని సెగ మీద కలుపుతూ వేపాలి. జీలకర్ర చిటపటలాడే సమయంలో 1 1/4 టేబుల్ స్పూన్ల నల్ల నువ్వులు (తెల్ల నువ్వుల కంటే నల్ల నువ్వులు ప్రత్యేకమైన రుచి, పరిమళాన్ని ఇస్తాయి) వేసి, చిటపటలాడే వరకు వేయించాలి. ఈ వేగిన దినుసులను తీసి మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకోవాలి.

అదే పాన్ 1/3 కప్పు (85 మిల్లీలీటర్లు) నువ్వుల నూనె పోసి, వేడి అయ్యాక ఒక టేబుల్ స్పూన్ ఆవాలు, 1 1/2 టేబుల్ స్పూన్ల పచ్చిశనగపప్పు, 1 1/2 టేబుల్ స్పూన్ల మినప్పప్పు, 60 గ్రాముల వేరుశనగ గుండ్లు వేసి, మీడియం టు లో ఫ్లేమ్‌లో ఎర్రగా, కరకరలాడేలా వేయించాలి. తాలింపు చక్కగా వేగిన తర్వాత నాలుగు రెబ్బల కరివేపాకు, అర టీ స్పూన్ ఇంగువ వేసి వేపాలి.

వేగిన తాలింపులో నానబెట్టుకున్న చింతపండు పులుసు, ఉసిరికాయంత బెల్లం ముక్క వేసి హై ఫ్లేమ్‌లో ఒక పొంగు రానివ్వాలి. దీని వల్ల చింతపండు పచ్చి వాసన పోతుంది. ఇప్పుడు మెత్తగా గ్రైండ్ చేసుకున్న మిరియాల పొడి వేసి కలిపి, చిక్కని పేస్ట్ లా అయ్యే వరకు ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి కలుపుతూ ఉడికించుకోవాలి. పులుసు ఎంత నిదానంగా ఉడికితే, ఫ్లేవర్స్ అంతగా పులుసులోకి కలిసిపోతాయి. సుమారు 20 నిమిషాల పాటు మరిగించడం వల్ల పులుసు సరైన చిక్కదనం వస్తుంది.

స్టవ్ ఆపేసి, వండుకున్న అన్నాన్ని పులుసులో వేసి జాగ్రత్తగా కలపాలి. పులుసు అన్నానికి చక్కగా పట్టడానికి కనీసం 30 నిమిషాల పాటు అలాగే వదిలేయాలి. అప్పుడే మిరియాల పులిహోర ఘుమఘుమలాడే రుచితో సిద్ధమవుతుంది. ఈ పద్ధతిని ఫాలో అయ్యి మీరు కూడా ఆలయాల్లో దొరికే అద్భుతమైన మిరియాల పులిహోరను ఇంట్లోనే తయారుచేసి తినండి.

నరాల బలహీనతకు కత్తిలాంటి ఫుడ్..
నెలకు ఒక్కసారైనా ఈ కూర తినండి..





పచ్చి మాంసంతో చేసే వంటకాలెన్నో ఉన్నప్పటికీ, పూర్వకాలంలో మన పెద్దలు అనుసరించిన ఆహారపు అలవాట్లలో 'ఎండు మాంసానికి' ఒక ప్రత్యేక స్థానం ఉండేది.

ముఖ్యంగా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన వట్టి తునకల కూర (ణతీఱవఎ వీఓశీఅ జబతీతీఎ) కేవలం రుచికరమైన వంటకమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బలవర్ధకమైన ఆహారం. నరాల బలహీనతను తగ్గించడంతోపాటు.. శరీరానికి బలాన్నిస్తుంది. నేటి తరానికి పెద్దగా పరిచయం లేని ఈ సంప్రదాయ వంటకం వెనుక ఉన్న ప్రత్యేకతలు, ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. వాస్తవానికి.. తాజా మేక లేదా గొర్రె మాంసానికి (మటన్) తగినంత ఉప్పు, పసుపు పట్టించి, వాటిని దండలాగా గుచ్చి ఎండలో పూర్తిగా ఆరబెడతారు. ఇలా వారానికి పైగా ఎండబెట్టిన మాంసపు ముక్కలను 'వట్టి తునకలు' అంటారు. వీటిని గాలిచొరబడకుండా భద్రపరుచుకుంటే నెలల తరబడి నిల్వ ఉంటాయి. అవసరమైనప్పుడు టమాటాలు, దోసకాయలు లేదా ఉల్లిపాయలతో కలిపి రుచికరమైన కూరగా వండుకుంటారు.

ఆరోగ్య ప్రయోజనాలు – పోషకాల నిధి:
ఎండబెట్టడం వల్ల మాంసంలోని నీటి శాతం తగ్గి, ప్రొటీన్లు, విటమిన్ బి12 (ఎఱ్ఝఎఱఅ దీ12) వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే.. పూర్వకాలంలో మనుషులు అంత గట్టిగా ఉండేవారని నిపుణులు చెబుతున్నారు.

ఒట్టి తునుకలు తినడం వల్ల ఎముకలకు, కండరాలకు బలం చేకూరుతుంది. నాడీ వ్యవస్థకు మేలు చేస్తుంది..

వట్టితునకలు తినడం చిన్నా.. పెద్ద అందరికీ చాలా మంచిది. ప్రసవానంతరం బాలింతలకు త్వరగా శక్తి అందడానికి, శరీరం దృఢంగా మారడానికి ఈ కూరను ప్రత్యేకంగా పెట్టేవారు.

అలాగే దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి కోలుకుంటున్న వారికి తక్షణ శక్తిని ఇవ్వడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది.
ఈ సంప్రదాయ ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి కావలసిన పోషకాలు అంది, నీరసం తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వట్టి తునకల కూర తయారీ విధానం:

ముందుగా వట్టి తునకలను శుభ్రం చేసి, వేడి నీటిలో సుమారు అరగంట పాటు నానబెట్టాలి. కుక్కర్‌లో నూనె వేడి చేసి పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, నానబెట్టిన తునకలను వేసి కొద్ది సేపు మగ్గనివ్వాలి.

తగినన్ని నీళ్లు, ఉప్పు, కారం, ధనియాల పొడి, గరం మసాలా జోడించి కుక్కర్ మూత పెట్టి సుమారు 4 నుంచి 5 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. చివరగా గ్రేవీ చిక్కబడిన తర్వాత కొత్తిమీరతో అలంకరిస్తే గుమగుమలాడే సంప్రదాయ వట్టి తునకల కూర సిద్ధమవుతుంది. అయితే.. పూర్వకాలంలో ఈ ఎండు మాంసాన్ని మంచిగా తినేవారు అందుకే.. అంత బలంగా ఉండేవారని ఆహార నిపుణులు చెబుతున్నారు.

మాంసం.. ఎండబెట్టే సమయంలో పరిశుభ్రత, సరైన నిల్వ, పూర్తిగా ఉడికించడం చాలా ముఖ్యం. ఉప్పు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవాలి.. అయితే.. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించండి.

స్టాక్ మార్కెట్ Stock Market

Gold, Silver Prices Fall:

పడిపోయిన బంగారం, వెండి ధరలు..

ఇప్పుడు కొనాలా .. వేచి చూడాలా?



ధంతేరస్‌కు, దీపావళి పండుగలకు ముందు పసిడి ప్రియులకు ఊరట లభించింది. రికార్డ్ స్థాయిల నుంచి బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి.

పండుగ వేళ ఆభరణాలు లేదా పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఇది మంచి అవకాశమా లేక ధరలు మరింత తగ్గే వరకు వేచి చూడాలా అనే దానిపై మార్కెట్ నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.

ధరల్లో భారీ పతనం:

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో బంగారం ధరలు ఒక్కసారిగా క్షీణించి, రూ. 1.40 లక్షల దిగువకు పడిపోయాయి. అలాగే వెండి ధరలు కూడా భారీగా పడిపోయి కిలోకి సుమారు రూ. 1.80 లక్షల దిగువకు చేరాయి. జనవరి నెలలో నమోదైన గరిష్ట రికార్డులతో పోలిస్తే వెండి మరియు బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి.

అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల అంచనాలు ఈ ధరల తగ్గుదలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

ఇప్పుడు కొనాలా? వేచి చూడాలా?

కొనుగోలుదారులకు అనుకూలం: ధంతేరస్ సందర్భంగా బంగారం లేదా వెండి కొనుగోలు చేయాలని భావించే వారికి ప్రస్తుత ధరల తగ్గుదల మంచి ఊరటని ఇస్తుంది. రికార్డ్ గరిష్ట ధరలతో పోలిస్తే ఇప్పుడు రేట్లు తక్కువగా ఉండటంతో వినియోగదారులు ముందుకు వస్తున్నారు.
మార్కెట్ నిపుణుల సలహా: నిపుణుల అభిప్రాయం ప్రకారం, పండుగ రోజు ఒక్కరోజే మొత్తం కొనుగోలు చేయకుండా, అవసరాన్ని బట్టి విడతలవారీగా కొనుగోలు చేయడం శ్రేయస్కరం. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పిస్తుంది. దీపావళి, ధంతేరస్ వేళ బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ధరల సవరణ ఒక మంచి కొనుగోలు అవకాశాన్ని అందిస్తోందని చెప్పవచ్చు. అక్టోబర్‌లో వెండి ఫ్యూచర్లు సుమారు 20 శాతం, బంగారం ఫ్యూచర్లు దాదాపు 7 శాతం పడిపోయిన తీవ్రమైన దిద్దుబాటు తర్వాత ఈ పతనం చోటుచేసుకుంది.
వినియోగదారులు లోహం స్వచ్ఛతను కూడా తనిఖీ చేయాలి. ఆభరణాల కోసం సాధారణంగా 22-క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, డిజైన్ల కోసం 18-క్యారెట్ల బంగారం ప్రజాదరణ పొందుతోంది. కొనుగోలు చేసే ముందు, దీ×ూ హాల్‌మార్క్, స్వచ్ఛత మార్కింగ్, ఆరు అంకెల హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (ఎఖ×ణ) కోడ్‌ను తనిఖీ చేయండి. దీ×ూ కేర్ యాప్ ద్వారా ఎఖ×ణని ధృవీకరించుకోవచ్చు.

దీపావళి గిఫ్ట్ రూ.8లక్షలు..
ఇలా చేశారంటే చాలు బ్యాంక్ ఖాతా ఖాళీ..!



పండుగ వచ్చిందంటే చాలు.. షాపింగ్ ఆఫర్లు, డిస్కౌంట్లు, గిఫ్టుల పేరుతో ఎన్నో ప్రకటనలు కనిపిస్తుంటాయి. ఇదే అదనుగా భావిస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా దీపావళి సందర్భంగా రూ. 8 లక్షల విలువైన గిఫ్ట్ అందిస్తామంటూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ వ్యక్తుల పేర్లతో నకిలీ సందేశాలు, లింకులు రూపొందించి వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నారు. ఈ లింకులపై క్లిక్ చేస్తే భారీ బహుమతి వస్తుందని నమ్మిస్తున్నారు. ఇలాంటి నకిలీ ప్రచారాలను నమ్మి మోసపోవద్దని సైబరాబాద్ పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

ప్రముఖుల పేర్లతో నకిలీ లింకులు
సైబర్ నేరగాళ్లు ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు ప్రముఖ వ్యక్తుల పేర్లు, ఫొటోలను ఉపయోగిస్తున్నారు. రూ. 8 లక్షల విలువైన దీపావళి గిఫ్ట్ గెలుచుకున్నారంటూ ఆకర్షణీయమైన సందేశాలు పంపిస్తున్నారు. ఈ సందేశాల్లో ఉండే లింకుల ద్వారా వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిసార్లు నకిలీ వెబ్‌సైట్లకు తీసుకెళ్లి ప్రజలను మోసగిస్తున్నారు. అందువల్ల గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయడం ప్రమాదకరమని పోలీసులు సూచిస్తున్నారు.

సైబర్ మోసాల నుంచి తప్పించుకోవాలంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి:

సైబరాబాద్ పోలీసులు తమ పోస్టులో ప్రజలకు పలు సూచనలు చేశారు.
1. తెలియని లింకులు వద్దు: వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దు.
2. బ్యాంకింగ్ వివరాలు చెప్పొద్దు: మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, ఇతర రహస్య సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దు.
3. అపరిచిత మెసేజ్‌ల పట్ల జాగ్రత్త: అనుమానాస్పద సందేశాలు, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దు.
4. గిఫ్ట్ ఆఫర్లను నమ్మేముందు పరిశీలించండి: లక్షల రూపాయల విలువైన బహుమతులు ఇస్తామనే సందేశాల వెనుక నిజానిజాలు తెలుసుకోండి.

సైబర్ మోసానికి గురైతే వెంటనే ఇలా చేయండి:
ఒకవేళ పొరపాటున సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నా, భయపడకుండా వెంటనే స్పందించాలి. ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలి. అలాగే అధికారిక సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ఎఎఎ.ఎఎఎవతీఎతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా సంబంధిత అధికారులకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

పండుగ వేళ అప్రమత్తంగా ఉండండి:
దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన సమయంలో ఇలాంటి నకిలీ గిఫ్ట్ ఆఫర్లకు ఆకర్షితులై కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోవద్దు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆఫర్ నిజమైనది కాదు. ముఖ్యంగా రూ. 8 లక్షల గిఫ్ట్ అంటూ వచ్చే సందేశాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు.



దేశీయ మార్కెట్లలో జోరు...
భారీ లాభాలతో దూసుకెళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రారంభ ట్రేడింగ్‌లో భారీ లాభాలతో దూసుకుపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో సూచీలు పరుగు తీసినట్లు తెలుస్తోంది. బీఎస్ఈ సెన్సెక్స్ ప్రారంభ సెషన్‌లోనే 614.66 పాయింట్లు పెరిగి 76,301.63 పాయింట్ల స్థాయికి చేరింది. అదే బాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 149.80 పాయింట్ల లాభంతో 23,588.55 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. కీలక రంగాలైన బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ విభాగాల షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపించడంతో సూచీలు ప్రారంభంలోనే బలమైన ర్యాలీని నమోదు చేశాయి. మార్కెట్ల ఉత్సాహంతో మదుపర్ల సంపద కూడా ఒక్కసారిగా పెరిగింది.

ఆపదలో ఉన్నరైతుకు అండగా నిలిచిన యువ నాయకుడు చైతన్య కిరణ్



వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నరైతు రాజును యువ నాయకుడు చైతన్య కిరణ్ సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. కొంత ఆర్థిక సహాయం కూడా అందజేశారు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం రొంపల్లి గ్రామానికి చెందిన రైతు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాజు వ్యవసాయంలో నష్టాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, అడ్వకేట్ చైతన్య కిరణ్ మల్కాపురం ఆసుపత్రికి వెళ్లి రాజును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. అలాగే, ఆపదలో ఉన్నరైతు కుటుంబానికి అండగా నిలుస్తూ తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య కిరణ్ మల్కాపురం మాట్లాడుతూ, రైతు కష్టాన్ని అర్థం చేసుకోవడం, ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలవడం మనందరి బాధ్యత అని అన్నారు. వ్యవసాయంలో నష్టాలు ఎదురైనప్పుడు రైతులు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా ప్రాణాలను తీసుకునే ఆలోచన చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని, రాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రైతు కన్నీటిని తుడవడం మన బాధ్యతని అన్నారు. కష్టకాలంలో భరోసా ఇవ్వడం మన ధర్మమని అన్నారు. ఆపదలో ఉన్నరైతుకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమనిపిస్తోందని అన్నారు.

పోలీసు సిబ్బంది ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- ఐజీ షానవాజ్ ఖాసిం
- వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ తనిఖీ





సంగారెడ్డి బ్యూరో, (సింగిడి): వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన మల్టీ జోన్--II ఐజీ షానవాజ్ ఖాసిం కి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐజీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, జిల్లా ఎస్పీతో కలిసి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో మొక్కలు నాటారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆర్ఐ స్టోర్, మోటార్ వెహికల్ సెక్షన్, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీమ్ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాటి నిర్వహణ, పనితీరు, సిబ్బంది విధుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధి నిర్వహణ సమయంలో బాడీ ప్రొటెక్టర్లు, లాఠీలు, హెల్మెట్లు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ఆర్ఐ స్టోర్‌లోని ప్రతి వస్తువు వినియోగానికి సిద్ధంగా, మంచి స్థితిలో ఉండాలని, సంబంధిత అధికారులు వాటి నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. మోటార్ వెహికల్ సెక్షన్‌ను తనిఖీ చేస్తూ ప్రతి పోలీసు వాహనం మంచి కండిషన్‌లో ఉండేలా ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించాలని, వాహనాలు నిరుపయోగంగా ఉండకుండా చూడాలని సూచించారు. వాహనాల పరిస్థితిని క్రమం తప్పకుండా తనిఖీ చేసి, వాహనాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ సిబ్బందికి రివార్డులు అందించాలని అధికారులకు సూచించారు. డాగ్ స్క్వాడ్‌ను పరిశీలిస్తూ జాగిలాల ఆరోగ్యం, ఆహారం, సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాటికి క్రమం తప్పకుండా పరేడ్, డ్రిల్ నిర్వహిస్తూ, వివిధ రకాలను కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించాలని అన్నారు. డాగ్ హ్యాండ్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని, జాగిలాల సర్వీస్ బుక్స్, ఆరోగ్య వివరాలు, రోజువారీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఆర్ఐ స్టోర్ తనిఖీ చేస్తూ, పోలీసు సిబ్బందికి అందించాల్సిన రెయిన్‌కోట్లు, వూలెన్ జాకెట్లు తదితర అవసరమైన సామగ్రిని సకాలంలో అందేలా చూడాలని, వర్షాకాలంలో వరదలు, చెరువులు, కుంటల వద్ద జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన భద్రత కిట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని ప్రశంసించారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు. అనంతరం డీఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో ఐజీ మాట్లాడుతూ ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, తరచూ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ., అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచి, అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నివారణకు ముందస్తు సమాచార సేకరణ, పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, సైదా నాయక్, సురేందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస రావు, ఇన్‌స్పెక్టర్లు రమేష్, సదానాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీకే సమస్యలపై సంక్షేమ సంఘం సమరశంఖం

- సీఎంసీ కార్యాలయం ఎదుట నిరసన, ప్రజావాణిలో డీసీకి వినతిపత్రం అందజేత
- 17 ఏళ్లుగా తీరని సమస్యలు, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్



కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): రాజీవ్ గృహకల్ప (ఆర్‌జీకే) సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో సోమవారం చింతల్ సీఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, మహిళా భవనం, సంక్షేమ సంఘం కార్యాలయం, పార్కుల అభివృద్ధి, విద్యుత్, వీధి దీపాలు, పోలింగ్ బూత్ ఏర్పాటు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో డీసీ లక్ష్మీ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ధర్మారం అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి మాట్లాడుతూ సుమారు 17 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఆర్‌జీకేలో పదివేల మందికి పైగా నివసిస్తున్నా, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి మాత్రం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రత్యేక నిధులు కేటాయించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపై డీసీ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నర్సింహా రెడ్డి, జగదీశ్, బాన్సూడ వెంకటేష్, నాగభూషణం, సంక్షేమ సంఘం నాయకులు, మహిళా సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యపై అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కార్యాచరణ

టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం



జవహర్‌నగర్, నవంబర్ 3 (సింగిడి): జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో నెలవై ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యపై పలు పార్టీలు ప్రజా సంఘాలు ప్రజలు నిరసన తీవ్రమవుతున్న తరుణంలో సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై మహేష్ కుమార్ గౌడ్ తో వజ్రేష్ యాదవ్ చర్చించారు. ఈ సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్య తీవ్రత చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఈనెల మూడవ తేదీన ఉదయం 11 గంటలకు నాగారంలోని ఎం.వి.ఆర్ ఫంక్షన్ హాల్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రజా సంఘాల ప్రతినిధులు డంపింగ్ యార్డ్ సమస్యపై పోరాడుతున్న నాయకులు ప్రజలు మద్దతుదారులు హాజరై తమ అభిప్రాయాలు సూచనలు తెలియజేసి సమస్య పరిష్కారానికి సహకరించాలని తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోటేష్ గౌడ్, మనోధర్ రెడ్డి, నాయకం భాస్కర్, బల్లి శ్రీనివాస్ గుప్తా, మాట్ల వినయ్, సత్యం, కిరణ్, జవహర్ నగర్ కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



బాలయ్యనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తా..

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): మౌలిక వసతుల కల్పననే లక్ష్యంగా గాజుల రామారం సర్కిల్ మహదేవపురం డివిజన్ బాలయ్య నగర్ లో సుమారు 47.50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు అధికంగా నివసించే బాలయ్య నగర్ బస్తీ నిలబెట్టేందుకు బస్తీ వ్యవస్థాపకులు ఎల్లయ్య చేసిన త్యాగం మరువలేనిదని, బాలయ్య నగర్ లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత పన్నండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణము, బతుకమ్మ ఘాట్, ఛత్ పూజ గాట్లను నిర్మించేందుకు మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ.నాగేష్, ఉపాధ్యక్షులు సిఎస్ఐ, ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి శ్యాంసుందర్, గంగయ్య, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ లైట్లను ప్రారంభించినఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): మౌలిక వసతుల కల్పనలో భాగంగా 125 - గాజుల రామారం డివిజన్ మల్లారెడ్డి నగర్ లో 4.50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. హైమాస్ లైట్ల ఏర్పాటుతో ప్రధాన కూడళ్లు, రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మెరుగైన వెలుతురు అందుబాటులోకి వస్తుందని, తద్వారా రాత్రి వేళల్లో ప్రజలకు, వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు వై.పి.గిరి, ప్రధాన కార్యదర్శి సికిందర్ రావు, సలహాదారులు దయాకర్ రెడ్డి, ఏ.వి.రావు, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

- అదనపు కలెక్టర్ సంగీత
- ప్రజావాణికి 68 దరఖాస్తులు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (సింగిడి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తుల విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని అదనపు కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు . ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 దరఖాస్తులు అందాయి. వీటిలో సంగారెడ్డి 21, నారాయణఖేడ్ 3, జహీరాబాద్ 2, సంగారెడ్డి కలెక్టరేట్‌లో 42 దరఖాస్తులు వచ్చాయి. అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు . వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి , సోషల్ వెల్ఫేర్ డి డి అఖిలేష్ రెడ్డి , జిల్లా బి సి సంక్షేమాధికారి జగదీష్ , జిల్లా సంక్షేమాధికారిణి లలితా కుమారి , జిల్లా వైద్యాధికారిణి లలిత దేవి , డి ఏ హెచ్ ఓ వసంతకుమారి , డి ఎల్ ఎస్ ఎ అడ్వొకేట్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మానవతా సహాయం



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి): బాధిత కుటుంబానికి రూ. రెండు లక్షల 50 వేల ఎల్ వో సీ ని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం అందజేశారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన కమ్మరి రంగయ్య కుమారుడు మహితేజ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్ వో సీ మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కమ్మరి రంగయ్య కుమారుడు మహితేజ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించండి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం



మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 3 (సింగిడి): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ,హౌజింగ్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 147 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించాలి



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని, వారి నుంచి ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 101 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ వో ఫర్హీన్ ఖాతూం, సెక్షన్ సూపరిండెంట్ దీపక్ , జిల్లా అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

అంసానిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కొల్చారం, నవంబర్ 3 (సింగిడి): ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు బాలల హక్కులను కాపాడుతూ, బాల కార్మికులు లేని ఆదర్శ గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా సహన సంస్థ పనిచేస్తోందని సంస్థ ప్రతినిధి సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా కొల్చారం మండలంలోని అంసానిపల్లి గ్రామంలో సహన సంస్థ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రామన్న గీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామన్న గీత మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న సహన సంస్థ ప్రతినిధులకు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సహన సంస్థ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, అన్ని గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణీందర్ కుమార్, గ్రామ సర్పంచ్ గీత రమేష్ , వార్డు సభ్యులు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రీతం కుమార్ రెడ్డి, డాక్టర్ శివ సాత్విక, నర్సింగ్ సిబ్బంది పావని, నందిని, ఫాతిమా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగప్ప, మేనేజర్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు అన్ని రంగాలలో విజయాలు సాధించాలంటే యువతకి విద్య ఎంతో ముఖ్యం

- తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రొట్టం భూపతి ముదిరాజు
- తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహణ



మల్కాజిగిరి, నవంబర్ 3 (సింగిడి): ముదిరాజులు అన్ని రంగాలలో విజయాలు సాధించాలంటే, రాబోయే తరం యువతకి విద్యా ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కముదిరాజ్ గిద్దలూరు రాణించాలని, మన ముదిరాజ్ బిడ్డలు ఎవరైనా ఆర్థికంగా చదువుకోడానికి ఇబ్బంది పడితే, తమ వంతు సహాయంగా విద్యార్థికి కావాల్సిన పుస్తకాలు, కోచింగ్ కోసం అవసరమైన ఆర్థిక సహాయం చేస్తామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రొట్టెం భూపతి ముదిరాజ్ అన్నారు. టీఎంజేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎంఎంఎస్ నగర అధ్యక్షులు పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్ అధ్యక్షతన దసరా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను బీసీ సాధికార సంస్థలు కార్యాలయము లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు రొట్టం భూపతి ముదిరాజు, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ ముదిరాజ్, ఆల్ ఇండియా కోలి సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు ముదిరాజ్, మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అశోక్ రాందాస్ ముదిరాజ్, రైల్వే ఎంప్లాయ్ అనిల్ ముదిరాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ జాతిలో విద్యతో పాటు రాజకీయంగా కూడా ఎదగాలని ప్రతి ఒక్కరూ జాతికి తమవంతు సేవ చేయాలని వారు కోరారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప జాతి ముసుగులో ముదిరాజులకు ద్రోహం చేస్తున్న నాయకులను గుణపాఠం నేర్పాలని యువతను ఉద్దేశించి అన్నారు. అంతేకాకుండా రాబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్ లో ముదిరాజులు నామినేషన్ వేయడానికి ముందుకు రావాలని, వారి వంతు బాధ్యతగా ప్రతి జిల్లాలో పర్యటించి అభ్యర్థికి తమ వంతు బాధ్యతగా మద్దతు తెలుపుతామన్నారు. పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ టీఎంజేఏసీ ఏర్పాటు చేయడానికి గల కారణాలు దాని యొక్క లక్ష్యం ఏమిటనేది సభను ఉద్దేశించి వారు వివరించారు. ముదిరాజ్ జాతి కోసం కేటాయించిన కోకాపేట 5 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు ఇంతవరకు ఒక ఇటుక కూడా పేర్చలేదని వారు ఆగ్రహ

జనరల్ NEWS

సింగిడి

ఖేత్ బచావో రైతులకు అవగాహన



గద్వాల బ్యూరో నవంబర్ 3 (సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో ఈరోజు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (ఐ=ఎఖ)జోగులాంబ గద్వాల కోఆర్డినేటర్ డా. పి. ఆర్చన "ఖేత్ బచావో" కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం కలిగిన వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్న, ఉలవలు, అలసందలు మరియు వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే, రాబోయే జూలై 2027 వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున నీరు మరియు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, అవసరమైన మేరకే సాగునీటిని వినియోగించాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు మండల వ్యవసాయ అధికారి శ్రీ హనుమంతు, ఆరగిద్ద వ్యవసాయ విస్తరణ అధికారి (ఆత్మ) ప్రతినిధి, ఆరగిద్ద గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, నవంబర్ 3 (సింగిడి): ఇటీవల అనారోగ్యానికి గురైన వ్యక్తులతో పాటు, మరణించిన కుటుంబ సభ్యులను సైతం మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించారు. సోమవారం ఖమ్మం నగర పరిధిలోని స్వల్ప అనారోగ్యానికి గురైన మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం ని వారి నివాసానికి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల అమెరికాలో మరణించిన నల్లమల ఆనంద్ కుమార్తె అక్షిత గారి దశదిన ఖర్మకు హాజరై నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మదూరి నాగార్జున ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్ళి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు ఆర్ జె సి కృష్ణ,బచ్చు విజయ్ కుమార్, కూరాకుల వలరాజు, బిక్కసాని జస్వంత్, ఎర్రా అప్పారావు, సాయి కిరణ్, మాటేటి కిరణ్, మోరంపూడి సాయి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేయాలి

అర్హులైన యువత పేర్లు నమోదు చేసుకోవాలి

పద్మారావు గౌడ్ పిలుపు..



సికింద్రాబాద్, నవంబర్ 3 (సింగిడి): అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నార్త్ లాలాగూడలో స్థానిక మైనారిటీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, అధికార యంత్రాంగం నిర్లిప్త వైఖరి కారణంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ మొక్కుబడిగా సాగుతోందని విమర్శించారు. అయితే, సికింద్రాబాద్ పరిధిలో బీఆర్ఎస్ నాయకుల చొరవతో ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం తుకారాం గేట్, అడ్డగుట్ట ప్రాంతాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్‌లను బీఆర్ఎస్ యువ నాయకుడు రామేశ్వర్ గౌడ్ ప్రారంభించారు. అక్టోబర్ 2023 నాటికి పట్టభద్రులైన యువత కొత్త ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు రామేశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం మా భూమిని అప్పగించండి

రఘునాథపాలెం తహసీల్దార్‌కు బాధితుడు వల్లూరి ఫణి శశాంక్ ఫిర్యాదు



ఖమ్మం, నవంబర్ 3 (సింగిడి): వారసత్వంగా సంక్రమించిన తమ భూమిని సర్వే చేసి, కొలతల ప్రకారం తమకు అప్పగించాలని కోరుతూ బాధితుడు వల్లూరి ఫణి శశాంక్ రఘునాథపాలెం తహసీల్దార్ (ఎమ్మార్వో)కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలం చింతకుర్తి గ్రామంలోని సర్వే నంబర్ 220/3లో ఎకరం భూమి, సర్వే నంబర్ 220/6లో ఎకరం రెండు కుంటల భూమి తమకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. అయితే ఈ భూమి 2018 సంవత్సరం వరకు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమి విషయంలో న్యాయపరమైన వివాదం ఏర్పడటంతో ఖమ్మం సివిల్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి కేసు నంబర్ 594/2026లో న్యాయస్థానం 24-07-2026న తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని, సంబంధిత భూమిపై తమ హక్కును కోర్టు తీర్పు ద్వారా స్పష్టం చేసిందని ఫణి శశాంక్ తెలిపారు.

-తీర్పు కాపీని ఎమ్మార్వో కార్యాలయంలో సమర్పించాం

కోర్టు తీర్పు కాపీని ఇప్పటికే రఘునాథపాలెం ఎమ్మార్వో కార్యాలయంలో సమర్పించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుతం తమ భూమి ఆక్రమణలోనే ఉందని, కోర్టు తీర్పు ప్రకారం అధికారులు చర్యలు తీసుకుని భూమిని సర్వే చేయాల్సిన అవసరం ఉందని కోరారు. తమకు చెందాల్సిన భూమిని అధికారికంగా సర్వే చేసి, రికార్డులు మరియు కొలతల ప్రకారం తమ వాటా భూమిని గుర్తించి తమకు అప్పగించాలని ఎమ్మార్వోను ఫణి శశాంక్ విజ్ఞప్తి చేశారు.కోర్టు తీర్పు నేపథ్యంలో రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి, సర్వే నిర్వహించి, వాస్తవ పరిస్థితిని నిర్ధారించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుభవాన్ని అభివృద్ధి పై చూపెట్టాలి

ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్న పట్టించుకోని అధికారులు

నెలల లోపు ఆస్పత్రి ఎప్పుడు పూర్తి చేస్తారో డేట్ లైన్ ప్రకటించాలి

లేదంటే అమర నిరాహార దీక్షకు వెనుకాడేది లేదు

సామాజికవేత్త డా.ఇ.ఎల్.వి. భాస్కర్





యాదాద్రి ప్రతినిధి,నవంబర్ 3 (సింగిడి): చౌటుప్పల్ పట్టణంలోని (100) వంద పడకల ఆసుపత్రి ఎప్పుడు ప్రారంభిస్తారో... డేట్ లైన్ ఒక నెలలోపు పాలకులు, లేదా అధికారులు తేదీని ప్రకటించాలని లేదంటే జరిగే సాధన పోరాట పరిణామాలకు బాధ్యత వహించాల్సి వస్తుందని సామాజిక వేత్తడాక్టర్ ఈ.ఎల్.వి భాస్కర్ హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోకుండా ఆ ప్రాంత ప్రజల ఎంతోమంది విలువైన ప్రాణాలు ఆస్తులు పోగొట్టుకుంటున్న గత మూడు సంవత్సరాల నుండి పాలకులు అధికారులు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా చౌటుప్పల్ లో ఆసుపత్రి సాధనలో ఈ ఎల్. వి సభ్యులు ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున గంటసేపు రోడ్డుపై బైఠాయించి సోమవారం రాస్తారోకో ముట్టడి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతినిధి బృందంతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సామాజిక వేత్త డాక్టర్. ఈ ఎల్ వి భాస్కర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి 90 శాతం పూర్తి చేసిన పాలకుల అధికారుల అలసత్వము నిర్లక్ష్యంతో ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రాలేదని,ఎంతో మంది విలువైన ప్రాణాలు, ఆస్తులు పోగొట్టుకుంటున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. అసలే జాతీయ రహదారి కావడం చౌటుప్పల్, చిట్యాల, మునుగోడు ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించిన రోగాల బారిన పడిన వైద్య నిమిత్తం హైదరాబాదుకు తరలించే లోపే ఎంతోమంది విలువైన ప్రాణాలు పోతున్నాయి తప్ప కనీసం అంబులెన్స్ లేక చౌటుప్పల్ పట్టణంలో ప్రాథమిక చికిత్స కూడా కరువు అయ్యిందని ఆరోపించారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయాల్లో అపారమైన అనుభవం ఉన్నవారు వారి అనుభవాన్ని అభివృద్ధిపై చూపెట్టాలని ఈ సందర్భంగా నిశితంగా విమర్శించారు. చౌటుప్పల్ ప్రాంతంలో అనేక పారిశ్రామిక కంపెనీలు ద్వారా కాలుష్యం, నిత్య ప్రమాదాలు బారిన పడుతున్నారని ప్రజల ఆరోగ్యంపై నిత్యం డాక్టర్లకు సందర్శించడం పారపాటిగా మారింది. ఎలాంటి ప్రమాదం జరిగిన అనారోగ్యానికి గురైన పూర్తిస్థాయి ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో పేషెంట్లు ఆస్తులు అమ్ముకొని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోవడం అప్పులు చేసి పేదవాలుగా మారిపోతున్నారని బాధాతప్త హృదయంతో ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ లో 100 పడకల ఆసుపత్రి ప్రభుత్వం ఏర్పాటు చేసి 150 మంది వైద్య సిబ్బంది అదేవిధంగా 60 మంది డాక్టర్లను నియమిస్తామని ఎన్నికల హామీలు ప్రజలకు నెరవేరడం కలగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి తీసుకొస్తే నిత్యము వేలాదిమందికి ఉచితంగా వైద్యము లభిస్తుందని పేదవారికి వైద్యం అందించి ప్రాణాలు కాపాడడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రాంతంలో ప్రజలకు విద్యా వైద్యం అందించే లక్ష్యంతో పోరాటం చేస్తామని, అందులో భాగంగానే ఇటీవల చౌటుప్పల్ లో పెద్ద ఎత్తున నిరసన తెలిపామని, పాలకులకు ప్రభుత్వానికి దసరా వరకు చౌటుప్పల్ ఆస్పత్రి అందుబాటులోకి తేవాలని లేకుంటే జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేస్తామని ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రి సాధనలో భాగంగానే నేటి రాస్తారోకో ధర్నా అని అన్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ అధికారులు ప్రజా పాలనలో ప్రభుత్వ వైద్యం రంగంలో అభివృద్ధిలో వెనుకాడేది లేదని ప్రకటనలకు పరిమితం కాకుండా నెల రోజులలోపు ప్రారంభించే డేట్ లైన్ పాలకులు లేదా అధికారులు ప్రకటన చేయాలని లేనియెడల ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడేది లేదని, చౌటుప్పల్లో పూర్తిస్థాయి ఆసుపత్రి అందుబాటులోకి తెచ్చే వరకు పోరాటం తప్పదని, పోరాటంలో జరిగే పరిణామాలకు పాలకులు అధికారులు బాధ్యత వహించాల్సి వస్తున్నది హెచ్చరించారు.

పెద్దఎత్తున ధర్నా చేయడంతో రోడ్డుపై గంటసేపు బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి ఈ విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు ధర్నా వద్దకు చేరుకొని నిరసన ను విరవింపజేసి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి అశోక్, బి సురేష్, దాస్, గోదాసు వెంకటేష్, సువర్ణ, బండ మీది కిరణ్, పట్నం బాలకృష్ణ, నరసింహ, ప్రేమ దాస్, మార్గం శివ, రవితేజ, రాజేంద్ర ప్రసాద్, ఈ ఎల్ వి సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు బేఖాతర్.. యథేచ్ఛగా అక్రమ నిర్మాణం!





- గేట్లకు గ్రీన్ నెట్ కట్టి నిర్మాణ పనులు..
- అధికారుల నోటీసులూ బేఖాతర్
- 600 మత్స్యకార కుటుంబాల జీవనాధారానికి ముప్పు...
- నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి..
- మత్స్యశాఖ చైర్మన్ శీలం నాగేంద్రబాబు డిమాండ్

కోదాడ, నవంబర్ 3 (సింగిడి): కోదాడ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి 600 మత్స్యకార కుటుంబాల జీవనాధారాన్ని కాపాడాలని పెద్ద చెరువు మత్స్యశాఖ చైర్మన్ శీలం నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంబంధిత శాఖ అధికారులు నిర్మాణ స్థలానికి వచ్చి నోటీసులు అతికించి పనులు నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ వాటిని బేఖాతర్ చేస్తూ నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోకుండా, ఆదేశాలు అమలయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.చెరువుపై ఆధారపడి సుమారు 600 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, చెరువు పరిధిలో ఆక్రమణలు, నిర్మాణాలు కొనసాగితే నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినడంతో పాటు మత్స్యకారుల ఉపాధికి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా, అధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా నిర్మాణం కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా భవన నిర్మాణంలోని ప్రవేశ ద్వారాలకు బయట నుంచి లోపలి పనులు కనిపించకుండా క్లాత్‌తో తెరలు ఏర్పాటు చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు బయటకు కనిపించకుండా గ్రీన్ నెట్ కట్టాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగేంద్రబాబు కోరారు. 600 మత్స్యకార కుటుంబాల జీవనాధారమైన పెద్ద చెరువును పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయకపోతే మత్స్యకార సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అమిత్ షా పాదయాత్రకు తరలి వెళ్లిన బీజేపీ పార్టీ నాయకులు



నాచారం, నవంబర్ 3 (సింగిడి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదయాత్రలో నాచారం మరియు హెచ్ఎంటి నగర్ ఉమ్మడి డివిజన్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘటిత శక్తిని చాటుకున్నారు. నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కె. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో, ఉమ్మడి డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మెట్టు ఉదయ్ కిరణ్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లెల నర్సింగ్ రావు, రాగిరి మోహన్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, మాల్కా ప్రకాష్, జిల్లా రాజ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీమూర్తి నాగరాజు, బీజేవైఎం నాయకులు అభిషేక్ గౌడ్, పాదం వెంకటేష్, ప్రతాప్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆనంద్, గుప్త, వెంకట్ నాయక్ వరలక్ష్మి, జ్యోతి రెడ్డి, లావణ్య కాంటేకర్ కిషోర్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, దర్శనాల వెంకటేశ్వర్లు, శేఖర్, కృష్ణ, నరసింహ రెడ్డి, మూల వెంకటేష్, కౌశిక్, దీక్షిత్ చింటూ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త బండి కనిపించక నెలయిపాయే.. అధికారుల అడ్రస్సేమో తెలియక పాయె





- పాములతో సహజీవనం... కంపుతో కాలక్షేపం
- పన్నుల వసూళ్లలో సింగాలు.. చెత్త నిర్మూలనలో గంభీరాలు
- ఇది జవహర్‌నగర్ మున్సిపల్ అధికారుల వైచిత్రి

జవహర్ నగర్, నవంబర్ 3 (సింగిడి): చెత్త బండి కనిపించక నెల రోజులు అయిపోయిందని... కానీ అధికారులు అడ్రస్ యే లేకుండా పోయారని పాములతో కాలనీలలో భయం భయంగా గడుపుతున్నామని పన్నుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ చెత్తను శుభ్రం చేయించడంలో శ్రద్ధ అధికారులకు ఏమాత్రం లేదని జవహర్ నగర్ ప్రజలు వాపోతున్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ప్రజలకు కనీస ప్రాథమిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీ ఫేస్ వన్ తో పాటు ముత్తుస్వామి కాలనీ బాలాజీ నగర్ సంతోష్ నగర్ కాలనీ సుక్కమ్మ కుంట, జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బిజెపి నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీ గబ్బిలాల పేట ప్రగతి నగర్ తదితర కాలనీలలో చెత్త పేరుకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి నిర్లక్ష్యానికి గురవుతున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గత నెల రోజులుగా కాలనీలోకి కనీసం ఒక్క చెత్త వాహనం కూడా రాకపోవడంతో రోడ్లన్నీ కంపు చెత్త మయంగా తయారయ్యాయని కుళ్ళిపోతున్న చెత్త కుప్పలతో కాలనీ మొత్తం దుర్వాసనమయంగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పారిశుద్ధ్యం పూర్తిగా పడకేయడంతో దోమలకు ఈగలకు ఆలవాలంగా మారిందని దోమల కాటుకు చిన్నపిల్లలు వృద్ధులు రోగాల బారిన పడుతుంటే మున్సిపల్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సోచనీయమన్నారు. బాధ్యత గల స్థానిక ప్రజలు తమ సమస్యలు చెప్పుకుందామని అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం కాల్స్ కూడా ఎత్తకపోవడం వారి అలసత్వానికి పరాకాష్ట అని అన్నారు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా అసలే సమస్యల లేమితో బాధపడుతున్న కాలనీవాసులకు విద్యుత్ స్తంభాలు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో కటిక చీకటి ఆవహిస్తుందని చీకటిని ఆసరాగా చేసుకుని విష సర్పాలు పాములు కాలనీలో రావడంతో రాత్రిపూట బయటకు రావాలంటే పిల్లలు పెద్దలు గుండెల్లో గుబులుతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని కాలం వెలదీస్తున్నారన్నారు. ఇకనైనా మున్సిపల్ యంత్రాంగం నిద్రమత్తు వీడి తక్షణమే స్పందించి చెత్త సమస్యను పరిష్కరించి చెత్త సేకరణ వెంటనే ప్రారంభించి విద్యుత్ స్తంభాలు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని జవహర్ నగర్ ప్రజలతోపాటు, బాలాజీ నగర్, లక్ష్మీనరసింహ కాలనీ, తదితర కాలనీ ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అర్హులైన ప్రతిఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులతో చందానగర్, మక్తా-మియాపూర్ డివిజన్ల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే శ్రీ మాధవరం కృష్ణా రావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రంలో కెసిఆర్ గారి నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు ప్రాధాన్యతను ఇస్తూ సత్వర పరిష్కారం చూపాలి

వినాయక నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, నవంబర్ 3 (సింగిడి): ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, పెండింగ్ పనులకు ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలని వినాయక నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతులు, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉదయం జోనల్ కమిషనర్ నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొన్న అధికారులకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. తరుణ ఎంక్లేవ్ వీధి దీపాలు క్రమీకరణ తోపాటు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఆర్ యు బీ సమీపంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యూటర్న్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదే ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టి ప్రాంతమంతా శుభ్రం చేయించాలని కోరారు. లక్ష్మీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులు చేపట్టి స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, వినాయకనగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్‌బాగ్ పార్క్ ముందు రోడ్డు, ప్యారడైజ్ సమీపంలో రోడ్డు, ఆనంద్‌బాగ్ మెయిన్ రోడ్ పక్కన టేబుల్ డ్రైన్ నిర్మాణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అనుమతులు త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చూడాలని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమం లో ఎంఎంసి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఎస్ఈ లక్ష్మణ్, ఎఈ నవీన్, సూపర్వైజర్ లు సాగర్, రమేష్, సానిటేషన్ డీఈ లావణ్య, సూపర్వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ కిష్టమ్మ, హార్టికల్చర్ సూపర్వైజర్ వెంకటేష్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జయకుమార్, పవన్, ఎస్ వివిస్ సుబ్రమణ్యం, రవికుమార్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఇబ్రహీంబాగ్ డివిజన్‌లో నేడు వినియోగదారుల దినోత్సవం

**రా

జనరల్ NEWS

సింగిడి

గ్రావెల్ అనుమతుల కోసం సులభతరమైన ఆన్‌లైన్ విధానం ప్రారంభం

- మూడు నుంచి ఐదు రోజుల్లో అనుమతులు మంజూరు
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్



హన్మకొండ, నవంబర్ 3 (సింగిడి): జిల్లాలో అక్రమ మైనింగ్ కు అడ్డుకట్ట వేయడంతో పాటు మట్టి (గ్రావెల్) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో నూతనంగా పోర్టల్ ను తీసుకువచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన సమీకృత గ్రావెల్(మట్టి) నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం) పోర్టల్ ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అమలు గురించిన వివరాలను అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈ విధానం ద్వారా పౌరులు తమ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా సులభంగా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.దరఖాస్తులు సంబంధిత అధికారులకు చేరతాయని, రెవెన్యూ భూములకు సంబంధించిన అనుమతులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమన్వయంతో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన అంశాలుంటే ఆ శాఖ లాగిన్‌కు కూడా దరఖాస్తును పంపించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు సమయంలో ఎక్కువ వివరాలు అడగకుండా ప్రాథమికంగా ఆధార్, తదితర వివరాలతో పాటు గ్రావెల్ ఎక్కడి నుంచి తీసుకోవాలనుకుంటున్నారనే వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

సొంత పట్టా భూమి నుంచి గ్రావెల్ తీసుకోవాలనుకుంటే పట్టాదారు పాస్‌బుక్ కాపీని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇతరుల పట్టా భూమి నుంచి తీసుకోవాలనుకుంటే సంబంధిత భూయజమాని నుండి సమ్మతి పత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో సర్వే నంబర్, జియో కోఆర్డినేట్స్ తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తుల పరిశీలన కోసం రెవెన్యూ శాఖకు మూడు పేజీల చెక్‌లిస్ట్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మట్టి (సిల్ట్)కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భాల్లో రెవెన్యూ శాఖకు, దానిని నీటిపారుదల శాఖకు ఫార్వర్డ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల శాఖ రెండు రోజుల్లో పరిశీలించి తిరిగి రెవెన్యూ శాఖకు పంపిస్తుందన్నారు. రెవెన్యూ శాఖ ఎన్ఓసీ ఇచ్చిన అనంతరం, పరిమాణం ఎక్కువగా ఉన్నట్లయితే మైనింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. పరిమాణం తక్కువగా ఉంటే జిల్లా లాగిన్‌కు వచ్చిన అనంతరం నేరుగా అనుమతులు జారీ చేస్తారని వివరించారు. అనుమతి మంజూరైన తర్వాత పూర్తి వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుందన్నారు. ఎంత పరిమాణంలో గ్రావెల్‌కు అనుమతి ఇచ్చారు, ఏ ప్రాంతం నుంచి తీసుకెళ్లాలి, ఏ లొకేషన్‌కు అనుమతి ఇచ్చారు, ఏ సమయానికి అనుమతి ఉంది అనే వివరాలు అందులో స్పష్టంగా ఉంటాయన్నారు. అలాగే అనుమతించిన ట్రాక్టర్లు, ఇతర వాహనాల నంబర్లు కూడా నమోదు అవుతాయని, అనుమతి పొందిన వాహనాల ద్వారా మాత్రమే గ్రావెల్ (మట్టి)తరలించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో గ్రామ పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. అనుమతించిన ట్రిప్పుల సంఖ్య, వాస్తవంగా తరలించిన ట్రిప్పుల సంఖ్యను పర్యవేక్షించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోర్టల్ వినియోగంపై రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా అందించినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్ నుండి మట్టి (గ్రావెల్) అనుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత రుసుము గ్రామ పంచాయతీలకు వెళ్తుందని తెలిపారు.

ఈ విధానంలో గ్రామ పంచాయతీలకు కూడా ప్రోత్సాహకం ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ పోర్టల్ ఇసుకకు సంబంధించినది కాదని, (మట్టి)గ్రావెల్ మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇసుక కోసం ఇప్పటికే ప్రత్యేక పోర్టల్ ఉందని తెలిపారు. జిల్లాలో నూతనంగా తీసుకువచ్చిన ఈ విధానం ద్వారా ఇసుక అనుమతులు జారీ చేయడం జరగదని తెలిపారు. ఇప్పటికే గనుల శాఖ వద్ద ఒక పోర్టల్ ఉన్నప్పటికీ, అది ప్రధానంగా ప్రభుత్వ పనులకు సంబంధించిన పెద్ద మొత్తంలో మైనింగ్ అనుమతుల కోసం మాత్రమే ఉపయోగపడుతోందన్నారు. జాతీయ రహదారుల వంటి పనులకు 2వేలు లేదా 3వేల మెట్రిక్ టన్నుల పరిమాణంలో అనుమతులు తీసుకునే ప్రక్రియ అందులో ఉందని వివరించారు. అయితే గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ఇతర చిన్నచిన్న పనుల కోసం తక్కువ పరిమాణంలో గ్రావెల్(మట్టి)అవసరమైనప్పుడు అనుమతులు ఎలా పొందాలో ప్రజలకు స్పష్టత ఉండటం లేదన్నారు. అలాంటి వారి సౌలభ్యం కోసమే జిల్లాలో ఈ సులభతరమైన పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్రావెల్ అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం (ఐ జి ఎం ఎస్) పోర్టల్ కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు లాంఛనంగా ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్ల ప్రసాద్,సీజీజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఈడీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

డబల్ బెడ్ ఇళ్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి



- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ నవంబర్ 3 (సింగిడి): మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లో నూతనంగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇళ్లను ఈ నెల 6వ తేదీన రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ, ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే మంత్రులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సభా ప్రాంగణం, వేదిక ఏర్పాటు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కృషి చేస్తోందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి , ఇన్చార్జి ఎమ్మార్వో శర్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీజ రెడ్డి , ఎంపిడిఓ శేషగిరి శర్మ , ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కాళేశ్వర ఆలయంలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక పూజలు

సరస్వతి ఘాట్, ఆలయ అభివృద్ధి పనుల సందర్శన



మహదేవపూర్ నవంబర్ 3 (సింగిడి): దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్, గడ్చిరోలి జిల్లా కలెక్టర్ అవిశాంత్ పండా తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పూజారులు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక మండపంలో పూజారులు స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం త్రివేణి సంగమం సమీపంలో సరస్వతి పుష్కర్ ఘాటు సందర్శించి రాబోయే గోదావరి పుష్కరాల కోసం చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లు ఘాట్ లభివృద్ధి పనులను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వారికి వివరించారు. కాళేశ్వర దేవస్థానం ఆలయ పునర్నిర్మాణ పనులను వారు పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలోకి ప్రమాదకర రసాయన వ్యర్థాలు!

- నల్లగొండ జిల్లాలో యథేచ్ఛగా కెమికల్ వ్యర్థాల పారబోత.. ప్రజారోగ్యం, పర్యావరణానికి ముప్పు
- ట్యాంకర్ల కదలికలపై నిఘా ఏదీ?
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణపై ప్రశ్నలు
- నిందితుల కోసం సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తున్న పోలీసులు



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 3 (సింగిడి): జిల్లాలో రసాయన వ్యర్థాల అక్రమ పారబోత వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. ఇప్పటివరకు జాతీయ రహదారి వెంట ఉన్న చెరువులు, కుంటలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కెమికల్ వ్యర్థాల మాఫియా, ఇప్పుడు ఏకంగా నాగార్జునసాగర్ లోలెవల్ కాలువలోనే ప్రమాదకర రసాయన వ్యర్థాలను పారబోస్తున్నట్లు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. పెద్దవూర మండలం చింతపల్లి సమీపంలో కాలువలో వ్యర్థ రసాయనాలను పారబోసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కెమికల్ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను నిబంధనల ప్రకారం శుద్ధి కేంద్రాలకు తరలించి శుద్ధి చేయాల్సి ఉండగా, కొందరు అక్రమార్కులు ఆ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీల నుంచి వ్యర్థ రసాయనాలతో బయలుదేరే ట్యాంకర్లను గమ్యస్థానమైన ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వరకు పర్యవేక్షించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్యాంకర్లు ఎక్కడ బయలుదేరుతున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? మధ్యలో ఎక్కడైనా వ్యర్థాలను అక్రమంగా పారబోస్తున్నాయా? అనే అంశాలపై నిరంతర నిఘా లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి పరిసరాల్లోని చెరువులు, కుంటల్లో రసాయన వ్యర్థాలను పారబోసినట్లు ఆరోపణలు ఉండగా, తాజాగా సాగునీటి కాలువనే లక్ష్యంగా చేసుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. లోలెవల్ కాలువలో ప్రమాదకర రసాయనాలు కలవడం వల్ల సాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని వినియోగించే రైతులు, పర్యావరణం, జలచరాలపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాలువలోని నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యర్థాల స్వభావాన్ని గుర్తించాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనపై ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. వ్యర్థ రసాయనాలను పారబోసిన ట్యాంకర్‌ను, బాధ్యులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి కెమికల్ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థాల తరలింపుపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ పారబోతలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిన్న చిన్న చిట్కాల ద్వారా విద్యుత్ వృధాను అరికట్టండి

- జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 3 (సింగిడి): : ఎల్ నినో పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు విద్యుత్తును ఆదా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా రెడ్ కో ఆధ్వర్యంలో "సేవ్ ఎనర్జీ" పేరున ఈనెల 1 నుండి 7 వరకు వారం రోజులపాటు నిర్వహించనున్న" సేవ్ ఎనర్జీ" కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న చర్యలను జిల్లా కలెక్టర్ వివరించారు. " సేవ్ ఎనర్జీ" కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రజలు అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా చిన్న చిన్న చిట్కాల ద్వారా విద్యుత్ ను ఎలా ఆదా చేసుకోవాలో చెప్పాలని, సోలార్ ఎనర్జీని వాడడం, ఈ- వేస్టేజ్ తదితర అంశాలపై జిల్లా అధికారులకు వివరించారు. జిల్లా , మండల, గ్రామస్థాయి వరకు అధికారులు,సిబ్బంది ఇకపై ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుండి 11:30 వరకు అన్ని కార్యాలయాలలో సూర్యరశ్మి ఎక్కువగా ఉన్నచోట లైట్లు ,ఫ్యాన్లు వేసుకోవద్దని, ఎయిర్ కండిషన్ ను 25 డిగ్రీలకు మించి పెట్టుకోకూడదని, విద్యుత్ ఆదా పద్ధతులను కింది స్థాయి వరకు తెలియజేయాలని, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులను ఒకచోట సమావేశపరిచి విద్యుత్ ను ఎలా ఆదా చేయాలనే దానిపై చిన్న చిన్న చిట్కాలను తెలియజేయాలని చెప్పారు. అవసరమైతే పిల్లల వర్క్ డైరీలో వీటన్నిటిని నమోదు చేయాలని, తద్వారా తల్లిదండ్రులు అదే పాటిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, జన సమ్మర్థం ఎక్కువగా ఉన్నచోట విద్యుత్తు పొదుపుపై ఫ్లెక్సీలు, స్టాండీలు ఏర్పాటు చేయాలని చెప్పారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులచేత "విద్యుత్తును పొదుపు చేస్తానని" ప్రతిజ్ఞ చేయించారు.

నవంబర్ 1 నుండి 15 వరకు బిర్సా ముండ 151 వ జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, జన జాతీయ గౌరవ దివస్ ఉత్సవాల పేరిట 15 వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు .ముఖ్యంగా గిరిజనులకు సంబంధించిన పథకాలు, చరిత్ర, చిత్రలేఖన, వ్యాసరచన, ఉపన్యాసపోటీలు ,వర్క్‌షాప్‌ల నిర్వహణ, ఎగ్జిబిషన్లు, క్విజ్ కాంపిటీషన్స్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.పెన్షన్ పొందే పెన్షన్ దారుడు చనిపోతే వెంటనే భార్య కు పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఇందుకు సంబంధించి ఎవరైనా అర్హులు ఉంటే డిఆర్డిఓ తో సంప్రదించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జనజాతీయ గౌరవ దివస్ సెలబ్రేషన్స్ పై రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ కమలాకర్ రెడ్డి ,రెడ్కో ప్రతినిధి అశోక్, తదితరులు హాజరయ్యారు.

నిరుపేదలకు పట్టాలిచ్చి గృహాలు నిర్మించాలి

- బీఆర్ఎస్, సీపీఎం పార్టీల శాంతియుత ర్యాలీ
- ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత



హన్మకొండ, నవంబర్ 3 (సింగిడి): వైఎస్సార్ నగర్ గుడిసెవాసులు, నిరుపేదలకు పట్టాలిచ్చి గృహ సముదాయాలను నిర్మించాలనీ డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట చౌరస్తా నుంచి ఎమార్వో కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 30 ఏండ్లుగా వై ఎస్ ఆర్ నగర్లో నివసిస్తున్న గుడిసె వాసులకు పట్టాలు అందచేసి పక్కా ఇండ్లు కట్టించాలనీ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కే సీ ఆర్ హయాంలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చామని అలాంటి పేదల గుడిసెలను కూల్చుతున్నవారిపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. వైఎస్సార్ నగర్లో ఉంటున్న గుడిసెవాసులు ఉంటున్న స్థలం వాస్తవంగా సీలింగ్ ల్యాండనీ సర్వే నంబర్ 70, 71, 72 భూమి విషయంలో రికార్డులు మారుతున్నాయనీ ఆయన ఆరోపించారు. వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందనీ వినోద్ కుమార్ భరోసా ఇచ్చారు.ప్రభుత్వ ప్రచారంలో ఇక్కడి గుడిసెవాసులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారనీ ఆయన గుర్తు చేశారు.వైఎస్ఆర్ నగర్ వద్ద ఉన్న కాంప్లెక్స్ కి 15 ఏండ్లలో రాని పర్మిషన్ నాయిని ఎమ్మెల్యే కాగానే ఎలా వస్తుందనీ ఆయన ప్రశ్నించారు. ఉద్రిక్తత.బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని, పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నడిమాండ్తో చేపట్టిన ర్యాలీ కాజీపేట ఎమ్మార్వో కార్యాలయానికి రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మాజీ పార్లమెంట్ సభ్యులు వినోద్ కుమార్ , మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ పోలీసులతో వాగ్వాదం జరిగింది. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డుపై బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు నార్లగిరి రమేష్, మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగ రావు, సోదా కిరణ్, తండమల్ల వేణు, జోరిక రమేష్, ఉడతల సారంగపాణి, వద్దిరాజ్ గణేష్, మేకల బాబురావు, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, రంజిత్, పున్నం చందర్, తదితరులు పాల్గొన్నారు.

27వ రోజూ కొనసాగిన అన్నదాన సేవ

800 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



కోదాడ, నవంబర్ 3 (సింగిడి): తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. సోమవారం 27వ రోజు సుమారు 800 మంది అయ్యప్ప స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. అనంతగిరికి చెందిన కొమెర సతీష్ దంపతులు తమ కుమారుడి జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నప్రసాద వితరణకు దాతలుగా వ్యవహరించారు. మహారాజపోషకుల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం విశేషం. అయ్యప్ప స్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, కుక్కడపు గోపాలకృష్ణ, దండు రమేష్, వెంగల వీరబాబు, ఆశీర్వాదం, సిద్దేపల్లి లక్ష్మయ్య తదితర మాలధారణ స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ నవంబర్ 3 (సింగిడి): ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటల రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండలంలోని బెట్టే తండా, రాళ్లవాగు తండా గ్రామాల్లో ఇటీవల వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూఅకాల గాలివానల కారణంగా పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, గాలివానల కారణంగా జరిగిన పంట నష్టాన్ని వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేసి, నష్ట వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో భూపాలపల్లి జిల్లాకు గుర్తింపు
- యువత ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రచారం..
- సురక్షిత ప్లస్ స్థాయికి జిల్లాను తీసుకెళ్లాలి
- కలెక్టర్ రాహుల్‌శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 3 (సింగిడి): యువత పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, అదే సమయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో సాధించిన ప్రగతిని కొనసాగిస్తూ జిల్లాను సురక్షిత ప్లస్ స్థాయికి తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు వేర్వేరు కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత 'చూస్ లైఫ్, నో టొబాకో' పోస్టర్‌ను ఆవిష్కరించి, టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0ను ప్రారంభించారు. అనంతరం హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో విశేష కృషి చేసిన వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతను పొగాకు వ్యసనాల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ లక్ష్యమని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గుట్కా, ఖైనీ, జర్దా, సిగరెట్ల వినియోగంతో క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నియంత్రించేందుకు సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 26 వరకు 60 రోజుల పాటు ద

జనరల్ NEWS

సింగిడి

రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించేది లేదు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి..

బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలి

కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

అధికారులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచన





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (సింగిడి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతు వేదికలో నందికంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యత కల్పించాలని, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని సూచించారు. ప్రతి క్వింటాల్ సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్‌ను తప్పనిసరిగా అందించాలని, గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను సైతం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని పేర్కొన్న ఎమ్మెల్యే గారు... రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాముగోపాల్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, చక్రపాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సుధాకర్, లక్ష్మారెడ్డి, సర్పంచ్ అశోక్ గౌడ్, రాజు, మనీష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ప్రభుత్వ ఏరియల్ హస్పిటల్ కార్మికులను తొలగించొద్దు

సీఐటీయూ కార్యదర్శి సాయిలు



సంగారెడ్డి బ్యూరో , నవంబర్ 3 (సింగిడి): జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులను తొలగించాలనే ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఈరోజు ఈ సమస్య పరిష్కారానికి కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి అడిషనల్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా సాయిలు మాట్లాడుతూ 208 బెడ్స్ ఆక్యుపెన్సీ కోసం కార్మికులను తీసుకున్నారు, కానీ ప్రస్తుతం 208 ఆక్యుపెన్సీ కాదు 100బెడ్స్ ఆధారంగానే కార్మికులకు వేతనాలు వస్తున్నాయని కాంట్రాక్టర్ చెబుతూ కార్మికులను కుదిస్తామని/తగ్గించాలని ఆలోచిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారనీ, ఇది సరైనది కాదని, హస్పిటల్ పరిసరాలు ప్రస్తుతం ఉన్న కార్మికులే పనిచేయడానికి సరిపోక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారనీ, మళ్ళీ కార్మికులను తొలగిస్తామని, వేతనాలు రావడం లేదని చెప్పడం దుర్మార్గమని అన్నారు. కార్మికులతో ఏళ్ల తరబడి పని చేయించుకుని ప్రస్తుతం తొలగిస్తే ఊరుకునేది లేదని అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్, హస్పిటల్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి ఎలీషా, నాయకులు గోపాల్, వసీం తదితరులున్నారు.

కరువు బారిన పడిన రైతాంగం ఆదుకోవాలి

నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయలు ఇవ్వాలి

అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్



సంగారెడ్డి బ్యూరో , నవంబర్ 3 (సింగిడి): సంగారెడ్డిలోని సుందరయ్య భవన్లో సోమవారం జరిగిన రైతు సంఘం సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినప్పటికీ. రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదని. కరువుతో వంట నష్టపోయిన రైతులకు ఎకరాకు ఆహార పంటలకు 30000 వాణిజ్య పంటలకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని. రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు మంజూరు చేసి కరువు లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు. నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణంలో జరుగుతున్న అఖిలభారత కిసాన్ సభ 36వ రైతు మహాసభలను జయప్రదం చేయాలని. 15వ తేదీ లక్ష మంది రైతులతోజరిగే బహిరంగ సభను. జిల్లాలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లిఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయరాజు సహాయ కార్యదర్శి భూషణం జిల్లా కమిటీ సభ్యులు మాణిక్ రెడ్డి. యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనతో సమగ్రాభివృద్ధి

బిఆర్ఎస్ ఎల్పీ, విప్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద





కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): మౌలిక వసతుల కల్పనలో భాగంగా 125 – గాజులరామారం డివిజన్ ఇందిరా నగర్ – "బి" కాలనీలో 33 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డులను ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధితోనే ప్రజాభివృద్ధి సాధ్యమని, అందులో భాగంగానే 33 లక్షల రూపాయలతో నూతనంగా సిసి రోడ్డు పనులు చేపట్టడం, పూర్తి చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు విజయరామరెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు షేక్ ఇమ్రాన్ బెగ్, షేక్ జునైద్, మూసా ఖాన్, మహమ్మద్ తాజుద్దీన్, అబ్దుల్ హనీఫ్, మహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ ఫరూక్, గోపీ, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరుతడి పంటలు సాగు చేయాలి

– ఏవో శ్వేత కుమారి



కొల్చారం నవంబర్ 3 (సింగిడి): మండల కేంద్రమైన కుల్చారం గ్రామంలో కేతి బచావ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా ఎల్ నినో ప్రభావం వలన రైతులు ఆరు తడి పంటలైన జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దు తిరుగుడు వంటి పంటలు సాగు చేయాలి అని సూచించారు. అలాగే సమగ్ర పోషక యాజమాన్య పద్ధతిలో భాగంగా పచ్చి రొట్ట పంటలు, జీవన ఎరువులు మరియు సూక్ష్మ పోషకాలు వాడుతూ నీల యొక్క ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అలాగే మట్టి నమూనా పరీక్షల విధానం మరియు వాటి వల్ల కలిగే లాభాలు వివరిస్తూ మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతు సోదరులకు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం ప్రతాపరెడ్డి, శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, తునికి, శ్వేత, మండల వ్యవసాయ అధికారి కూల్చారం మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు అలాగే రైతు సోదరులు పాల్గొన్నారు.

గోక్షేత్రం ప్రారంభోత్సవం పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





- ఆశీస్సులు అందించిన శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి): జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం వట్టిమినపల్లి గోవర్ధనగిరిపై గోక్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రంగా ఎదగాలని శాసన సభాస్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. సోమవారం నిర్వహించిన అదితి గోక్షేత్రం ప్రారంభోత్సవం, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవతా విగ్రహాల దివ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. అవధూత దత్తపీఠాధిపతి, పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య కరకమలముల మీదుగా వట్టిమీనపల్లి గ్రామంలోని గోవర్ధనగిరిలో నూతనంగా నిర్మించిన శ్రీ అదితి గోక్షేత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోక్షేత్ర ప్రాంగణంలో శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి తదితర దేవతా విగ్రహాల దివ్యప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు.శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గోశాల ప్రారంభోత్సవం అంటే మన సంస్కృతిని, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప పవిత్రమైన ప్రయత్నమని అన్నారు. భారతీయ సంస్కృతిలో గోవుకు చాలా ప్రాధాన్యత, విశేష స్థానం ఉందని మన జీవన విధానంలో గోవుకు, మనిషికి ఎంతో అవినాభావ సంబంధం ఉందని అన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో వ్యవసాయానికి, గ్రామీణ జీవనానికి, ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి ఎన్నో విధాలుగా తోడ్పడే జీవనాధారం గోవు అని చెప్పారు. మన భారతీయ వేదాలు, పురాణాలు, ఇతిహాసాల్లో గోమాత గొప్పతనాన్ని అనేక సందర్భాల్లో మన పెద్దలు, పూర్వీకులు ప్రస్తావించారని గుర్తుచేశారు. సంప్రదాయంలో కూడా గోవును సమస్త దేవతల నిలయంగా భావిస్తారని ఈ నేపథ్యంలో గోపూజకు, గోసేవకు, గోరక్షణకు మన ధర్మంలో ప్రత్యేక స్థానం కల్పించారని అన్నారు. సంస్కృతిని, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు. గోవును పూజించడం అంటే కేవలం ఒక ఆచారాన్ని పాటించడం కాదని మనకు అన్నం పెట్టే ప్రకృతిని, మనకు జీవనాధారం కల్పించే జీవజాలాన్ని గౌరవించడమేనని అన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముడు స్వయంగా గోపాలుడిగా అవతరించి, గోవులతో తన అనుబంధాన్ని ప్రపంచానికి చాటారన్నారు. గోశాల అంటే కేవలం గోవులను ఒకచోట ఉంచే ప్రదేశం కాదని, అది వాటికి ఆశ్రయం కల్పించే సేవా కేంద్రమని అన్నారు. గోశాలలు రైతులకు మార్గదర్శక కేంద్రాలుగా నిలవాలని, గోక్షేత్రం కేవలం గోవుల సంరక్షణకే పరిమితం కాకూడదని ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రంగా ఎదగాలన్నారు. మన ధర్మం మనకు నేర్పింది ఒక్కటే సమస్త జీవరాశుల పట్ల దయ చూపాలన్నారు. ధర్మం అంటే కేవలం దేవాలయానికి వెళ్లడం కాదని మన చుట్టూ ఉన్న జీవుల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించడం కూడా ధర్మమేనని ఆయన అన్నారు. పిల్లలకు సంపదతో పాటు సంస్కృతిని కూడా వారసత్వంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతీ యువకులు, గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

ద్వారకా నగర్ మాడ్రన్ కాలనీగా అభివృద్ధి చెందాలి





బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

కుత్బుల్లాపూర్, నవంబర్ 3 (సింగిడి): కుత్బుల్లాపూర్ డివిజన్ ద్వారక నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఆదివారం సాయంత్రం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణ, నేర దర్యాప్తులో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు తో ద్వారకా నగర్ కాలనీ నేడు స్మార్ట్ అండ్ సేఫ్ కాలనీగా మాత్రమే కాదు రానున్న రోజుల్లో మోడ్రన్ కాలనీగా అభివృద్ధి చెందాలన్నారు. గత పదేళ్ల కాలంలో కాలనీలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా కాలనీని మరింత అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎప్సె నాయుడు, అధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ గౌడ్, సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనాథ్, జెకె అంజిరెడ్డి, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, వెంకటేష్, సత్యనారాయణ గౌడ్, రాజు చారి, రోహిత్, హనుమంతు రావు, శ్రీనివాస్ గుప్తా, మల్లారెడ్డి, బాపు రెడ్డి, నర్సిరెడ్డి, మల్లికార్జున్, ప్రభాకర్ చారి, జంగయ్య, ఏఐటీయూసీ నాయకులు యూసుఫ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నసీరుద్దీన్, బొంబాయి శ్రీను, రమణా రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, శౌరి రాజ్, కొత్త నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి చెంప దెబ్బ కావాలి

- రాక్షస ప్రభుత్వంలో నిరుద్యోగులకు నిరాశ
- నిశ్శబ్ద విప్లవం తెచ్చే బాధ్యత పట్టభద్రులదే
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్నదాత అగచాట్లు
- ఐదు లక్షల ఓట్లు పెంచిన ఘనత పార్టీ శ్రేణులదే
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే బొల్లం,

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి



కోదాడ, నవంబర్ 3 (సింగిడి): కాంగ్రెస్ ప్రభుత్వ గత మూడు సంవత్సరాల పాలన లో రాష్ట్రంలోని అన్ని వర్గాలు దోకాకు గురయ్యాయని ముఖ్యంగా విద్యార్థి నిరుద్యోగ యువతకు స్కాలర్షిప్ లు, ఫీజు రియంబర్మెంట్ మంజూరు కాలేదని,. ఇక జాబ్ నోటిఫికేషన్ల ఊసే లేదని త్వరలో జరగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో చెంప చెల్లుమనిపించాలని బీ ఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పట్టభద్రులకు పిలుపునిచ్చారు... సోమవారం కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎన్నికల పరిశీలకులు తిప్పన విజయసింహారెడ్డి తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.... ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా విద్యారంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని బడుగు బలహీన వర్గాల కుటుంబాల పిల్లలు చదువుల కోసం ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాల వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు.. విద్యావంతులు మేధావులు వాస్తవ పరిస్థితులను గమనంలోకి తీసుకొని ఓటనే ఆయుధంతో ప్రజాదరణ కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.. ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన డబ్బును అధికార ప్రభుత్వం నమ్ముకుంటే మనం నిజాయితీని నమ్ముకున్నామనిఈ పరిణామం లో ప్రభుత్వ దుశ్చర్యలను నిలువరించేందుకు నిశ్శబ్ద విప్లవం తెచ్చే బాధ్యత పట్టభద్రులపైనే ఉందన్నారు.... గత ఉప ఎన్నికల్లో 4 లక్షల పైకి ఓట్లు నమోదు కాగా ఇప్పుడు ఐదు లక్షలకు పైగా ఓట్ల నమోదును పెంచిన ఘనత పార్టీ శ్రేణులు అన్నారు.. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ అమలకు సాధ్యం కానీ హామీలను ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టభద్రులు తమ ఓటుతో సమాధానం చెప్పాలన్నారు.... సాగునీరు విద్యుత్తు లేక అన్నదాతలు అగచాట్లు పడుతున్నారని, బీ ఆర్ఎస్ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ లోను సాగునీరు అందించి రైతులను ఆదుకున్న ఘనత బీ ఆర్ఎస్ దేనిని స్పష్టం చేశారు.. ఎన్నికల పరిశీలకులు తిప్పిన విజయసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నమోదు ప్రక్రియకు మరో వారం రోజులు అవకాశం ఉన్నందున నమోదు పెంచేందుకు కృషి చేయాలి అన్నారు.. అనంతరం ఓట్ల నమోదు ప్రక్రియ పై ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్ నర్సిరెడ్డి భూపాల్ రెడ్డి శీలం సైదులు జానకి రామాచారి సుంకర అజయ్ కుమార్, కిరణ్ శివాజీ ఎస్కే నయీమ్ కంది బండ సత్యనారాయణ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో భారీ మోసం చేసిన కేటుగాడు

1.50 కోట్లతో నిర్వాకుడు పరార్

అయోమయంలో బాధితులు



చేర్యాల ,నవంబర్ 3 (సింగిడి): చేర్యాల పట్టణ కేంద్రాలోని బీడీ కాలనీకి చెందిన మహమ్మద్ అజీర్ హైమద్ కొంతకాలంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు అమాయకులను నమ్మించి భారీ మోసానికి పాల్పడ్డాడు చిట్టీలు వేసిన వారిలో సుమారు 50 మందికి డబ్బులు చెల్లించకుండా వారే తనకు అప్పులు ఇచ్చారంటూ నిర్వాకుడు ఐపి పెట్టి కోర్టు ద్వారా నోటీసులు పంపినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు ఈ వ్యవహారంలో సుమారు 1.50 కోట్ల మేర మోసం జరిగినట్లు వారు చెప్తున్నారు చిట్టీలు పూర్తయి డబ్బులు తీసుకున్న సమయంలో బాధితులు తమ డబ్బులను అడగడంతో రేపు ,మాపు కాలయాపన చేస్తూ వస్తున్నాడు అని బాధితులు తెలిపినారు ఒకేసారి నోటీసులు అందడంతో అయోమయానికి గురైనారు చిట్టిల డబ్బులు చెల్లించవలసిన వ్యక్తి తమపై అప్పుల ఆరోపణ చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబాలు చిట్టిలు వేసిన నిర్వాహకుడు ఇంటిముందు ఆందోళన చేపట్టినారు చిట్టిల నిర్వాహకుడు ఆందోళన చేస్తారని ముందుగానే పసిగట్టి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా వెళ్లిపోయినట్లు బాధితులు చెబుతున్నారు తమకు న్యాయం చేయాలంటూ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ కలిసి వినతి పత్రం అందజేశారు నిర్వాకుడు పై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలిపినారు.

తుఫాను వేళ రహదారులపై అప్రమత్తత అవసరం

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి..

ఎంవీఐ జిలానీ షేక్ సూచన



కోదాడ, నవంబర్ 3 (సింగిడి): తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎంవీఐ జిలానీ షేక్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, లారీ, క్యాబ్, ఆటో యూనియన్లు, పాఠశాల బస్సుల యజమానులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వాహనాలను నెమ్మదిగా నడపాలని తెలిపారు. వరద నీరు ప్రవహించే రహదారులను దాటవద్దని హెచ్చరించారు. పాఠశాల బస్సుల బ్రేకులు, టైర్లు, వైపర్లు, లైట్లు తనిఖీ చేసుకోవాలని సూచించారు. వర్షాల సమయంలో వాహనాల మధ్య తగినంత దూరం పాటించాలని, దృశ్యమానత తగ్గినప్పుడు హెడ్‌లైట్లు వినియోగించాలని తెలిపారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం



ములుగు ప్రతినిధి, నవంబర్ 3 (సింగిడి): ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. సోమవారం మంగపేట మండల కేంద్రంలోని డీఆర్ సేల్స్ డిపో వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ తోట రవీందర్, సంబంధిత అధికారుల సమక్షంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణ రాష్ట్రం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తూ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశంతో వాటిని ప్రజల గడపగడపకు చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.సన్న బియ్యం పంపిణీతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, ఈ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు చాద మల్లయ్య, డాక్టర్ శ్రీనివాస్, ప్రసాద్, చాద శేఖర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంబంధిత అధికారులు, రేషన్ కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

యూత్‌ను మురిపిస్తున్న హెబ్బా

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం

వ్యక్తిగత వివరాలు

జననం: జనవరి 6, 1989 (కొన్ని రికార్డుల ప్రకారం1988)
పుట్టిన ప్రదేశం: ముంబై, మహారాష్ట్ర, భారతదేశం
కుటుంబ నేపథ్యం: కన్నడ మాట్లాడే ముస్లిం కుటుంబం
విద్య: సోఫియా కాలేజ్ ఫర్ విమెన్, ముంబై

సినీ ప్రస్థానం

మోడలింగ్: సినిమాల్లోకి రాకముందు హెబ్బా పటేల్ మోడల్‌గా పనిచేశారు.

నటన అరంగేట్రం:

2014లో వచ్చిన 'అధ్యక్ష' అనే కన్నడ చిత్రంతో నటిగా అడుగుపెట్టారు.
అదే సంవత్సరంలో 'తిరుమనం ఎనుం నిఖా' అనే తమిళ చిత్రంలో నటించారు.
2014లో వచ్చిన 'అలా ఎలా?' సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు.

ప్రముఖ విజయం: 2015లో సుకుమార్ దర్శకత్వ పర్యవేక్షణలో వచ్చిన 'కుమారి 21ఎఫ్' సినిమా ఆమెకు భారీ గుర్తింపును, క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. ఈ చిత్రంలో 'మీరా కుమారి' పాత్రతో యువతను ఆకట్టుకున్నారు.

ప్రముఖ చిత్రాలు:

ఈడోరకం ఆడోరకం (2016)
ఎక్కడికి పోతావు చిన్నవాడా (2016)
నాన్న నేను నా బాయ్‌ఫ్రెండ్స్ (2016)
అంధగాడు (2017)
ఏంజెల్ (2017)
24 కిస్సెస్ (2018)
ఒరేయ్ బుజ్జిగా (2020)
ఓదెల 2 (2025)

వెబ్ సిరీస్:

2020లో వచ్చిన 'మస్తీస్' (ఖిర్‌ఱ'ం) వెబ్ సిరీస్ ద్వారా డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టారు.



అలాంటి సినిమాలు రావాలి

నేచురల్ స్టార్ నాని



తెలుగు సినిమా ప్రజలకు దగ్గరగా ఉండే, వారితో మమేకమవ్వగలిగే చిత్రాలను రూపొందించాల్సిన అవసరం ఉంది అంటున్నాడు నేచురల్ స్టార్ నాని. దీనికి ఉదాహరణగా మలయాళంలో వచ్చిన 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' సినిమాను చెబుతూ.. 'అది ఒక సింపుల్ లవ్ స్టోరీ. హృదయానికి దగ్గరగా ఉండే ఎమోషన్స్ ఉన్న ఆ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద రూ. 300 కోట్లకు పైగా రాబట్టింది. అలాంటి కంటెంట్ ఉన్న కథలు రావాలి. అయితే తెలుగులో పెద్ద పెద్ద యాక్షన్ సినిమాలు, భారీ బడ్జెట్ ప్రాజెక్టులే ఎక్కువగా ఉన్నాయి. అలాంటి సమయంలో చిన్న ప్రేమకథలు కూడా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ సాధించాలి అనేదే నా కోరిక. తెలుగు సినిమాలో కూడా ఒక సాధారణ ప్రేమకథ, భారీ బడ్జెట్ చిత్రాల రికార్డులను తిరగరాసే క్షణం కోసం నేను వేచి చూస్తున్నాను' అంటూ నాని చేసిన ఈ కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

Natural Star Nani

అదిరిపోయిన 'ఈఎన్ఈ రిపీట్'



తెలుగు యూత్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కల్ట్ క్లాసిక్ ఫిల్మ్ సీక్వెల్ 'ఈ నగరానికి ఏమైంది 2' (ఈఎన్ఈ రిపీట్) ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. యువత ట్విస్ట్‌కు తగ్గట్టుగా ప్రామిసింగ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ ఈ చిత్రాన్ని ఫుల్ లెంగ్త్‌తో యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్ రూపుదిద్దారు. గతంలో వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం యూత్‌ను విశేషంగా ఆకట్టుకొని బాక్సాఫీస్ వద్ద అపారమైన ఆదరణతో కల్ట్ స్టేటస్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 8 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ఈఎన్ఎస్ఈ రిపీట్' ప్రచార చిత్రంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

విజయ్ దేవరకొండతో షార్ట్ ఫిలిం..

తాజాగా విడుదలైన ట్రైలర్‌లో కథానాయకుడు విశ్వక్‌సేన్, హీరో విజయ్ దేవరకొండతో షార్ట్ ఫిలిం తీస్తున్నట్లుగా చూపించిన సీన్స్ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మొదటి భాగంలో ఉన్న ఫ్రెండ్ షిప్, డైలాగ్ టైమింగ్, నవ్వుల పువ్వులు పూయించే కామెడీ సన్నివేశాలను ఈ సీక్వెల్‌లో మరింత డబుల్ డోస్‌తో డిజైన్ చేసినట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో విశ్వక్‌సేన్, శ్రీనాథ్ మాగంటి, అభినవ్ గోమటం, వెంకటేశ్, అనీషా, శివాత్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్ సాగర్ అందించిన సంగీతం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ కానుంది. ఎస్ఎస్ ఒరిజినల్స్ పతాకంపై సృజన్ యరబోలు నిర్మించిన ఈచిత్రం నవంబరు 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది.

సిన్మా సింగిడి
Cinma Singidi

బుధవారం
4-11-2026

Nithya Menon

మూడేళ్ల నిరీక్షణకు తెర..

విడుదలకు సిద్ధమైన 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే'

స్టార్ బ్యూటీ నిత్యా మీనన్ మరోసారి బాలీవుడ్‌లో తన మార్క్ చూపించేందుకు సిద్ధమయ్యారు. మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నారు. వివేక్ ఒబెరాయ్, నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే' టైటిల్‌తో రాబోతుంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. వేవ్‌బ్యాండ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై మూడేళ్లుగా నిర్మాణ పనులు జరుపుకుంటున్న ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ డిసెంబర్ 11న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతున్నట్లు వెల్లడించారు. ఇక ఇందులో నిత్యా మీనన్ పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా, ఊహించని షేడ్స్‌తో ఉండబోతున్నట్లు పోస్టర్ ద్వారా తెలుస్తోంది. ప్రాణంగా ప్రేమించే వ్యక్తి వల్లే ప్రాణభయం ఏర్పడితే ఎలా ఉంటుందనే ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో అంకుర్ పఖ్నీ, విశాల్ రంజన్ మిశ్రా సంయుక్తంగా తెరకెక్కించారు. రహస్యాలు, ఉత్కంఠ, ఊహించని మలుపులతో రాబోతున్న ఈ సినిమాలో శ్రేయా శర్మ, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రలో కనిపించబోతున్నారు.

Hebah Patel

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737